

అబ్బురపరచిన త్రివిధ దళాల విన్యాసాలు

● కాకినాడ సముద్ర తీరంలో టైగర్ ట్రయింఫ్

7

వ్యాపారి కిడ్నాప్ కలకలం





తునిలో గురువారం జరిగిన సభలో యనమలను సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. హాజరైన జనం

విజ్ఞాన గని యనమల

● సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు

● సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేత

● కొనియాడిన శాసనసభ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు

● తునిలో యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ

తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం తునిలో ఘనంగా జరిగింది. శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పలువురు మంత్రులు హాజరైన ఈ సభలో పుస్తకావిష్కరణతో ఫొటో గ్యాలరీలను ఏర్పాటుచేశారు. 7





» ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే

» 48 గ్రామాల్లో 52,280 మందికి నోటీసులు జారీ

» 21రోజుల్లో నోటీసులకు బదులివ్వాలి

» అభ్యంతరాల స్వీకరణ తర్వాత జేసీ లాగిన్‌కు నివేదిక

» జేసీ ఆధ్వర్యంలో రీ సర్వే నివేదిక తుది ప్రచురణ

» 15 నుంచి 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వే

తొలి విడత తేలింది!

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భూముల రీసర్వే క్రతువు కొలిక్కి వస్తోంది. తొలి విడతగా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించి రైతులకు నోటీసులు జారీచేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడత (పైలెట్ ప్రాజెక్ట్)గా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. దీనిలో కాకినాడ జిల్లాలో 15 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 17, తూర్పుగోదావరి జిల్లాలో 16 గ్రామాల్లో రీసర్వేకు ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన తొలి విడత సర్వేలో మూడు నెలలపాటు అంటే జనవరి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు అధికార బృందాలు పాల్గొన్నాయి. 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించి సర్వే చేశారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ భూముల విస్తీర్ణాన్ని బట్టి నాలుగు బృందాలుగా విభజించారు. ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్‌ఏలు ఒక బ్లాక్‌ను సర్వే చేశారు. ఇలా బృందాలు నిత్యం రీసర్వేలో పాల్గొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆదరాబాదరాగా భూముల సర్వే చేశారు. ఈ నేపథ్యంలో భూముల విస్తీర్ణం తగ్గిందని, హద్దులు మార్చేశారని, హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని పెద్దఎత్తున రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్రప్రభుత్వం భూముల రీసర్వేకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే నిర్వహించారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడతలో 16 గ్రామాల్లో భూముల రీసర్వే చేశారు. 19 వేలమంది రైతులకు నోటీసులు జారీచేశారు. క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దు కొలిచి ఏ మేరకు హక్కు పత్రాల్లో ఉన్నాయో గుర్తించారు.



కరపలో రీసర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

కాకినాడ జిల్లాలో...

కాకినాడ జిల్లాలో తొలి విడతలో 15 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో వేట్లపాలెం, కోలంక, కుమారపురం, పటవల, యల్లమిల్లి, జె.కొత్తూరు, ఎస్.తిమ్మాపురం, బోదవరం, కట్టమూరు, పి.జగన్నాథపురం, ఆర్.వెంకటపురం, శంఖవరం, కృష్ణపురం, భద్రవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో వ్యవసాయ పొలాలను రెవెన్యూ బృందాలు రీసర్వే నిర్వహించాయి. ఇటీవల 27 వేల మందికి 92 నోటీసులు జారీచేశారు. మరో 21 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొలి విడతలో 17 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో జొన్నాడ, వాడపల్లి, కొడగట్లపల్లి, ఓడరేవులపల్లి, భీమక్రోసుపాలెం, ముమ్మిడివరప్పాడు, అప్పన్నరామునిలంక, మట్టపర్రు, గాడిలంక, పశువులంక, ఉప్పలగుప్తం, ఎంట్రికోన, కందికుప్ప, నందంపూడి, వానపల్లి గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. 5,280 మంది రైతులకు 92 నోటీసులు జారీచేశారు.

తొలి విడత రీసర్వే నివేదిక

తొలి విడత భూముల రీసర్వే నోటీసులకు అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత నివేదిక తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ల లాగిన్‌కు వెళుతుంది. జాయింట్ కలెక్టర్ పరిశీలించిన తర్వాత ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. అక్కడ ఎలాంటి అభ్యంతరాలు లేని రీసర్వే నివేదికను తుది ప్రచురణ చేసి ఆమోదిస్తారు. ఈ నేపథ్యంలో రైతులు ఎంతోకాలంగా పరిష్కారం కాని భూముల హద్దులు, దొర్లిన తప్పుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించనుంది.

15 నుంచి రెండో విడత..

ఈనెల 15 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వేకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో కాకినాడ జిల్లాలో 14 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 15 గ్రామాల్లో, తూర్పుగోదావరి జిల్లాలో 17 గ్రామాల్లో రీసర్వేకు సర్వం సిద్ధమైంది. రెవెన్యూ బృందాలు, సర్వేయర్ల బృందాలను అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

దరఖాస్తులకు పరిష్కారం

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు నిండా మునిగారు. ఈ పది నెలల కాలంలో మూడు జిల్లాల్లో నిర్వహించిన గ్రామసభలకు, కలెక్టరేట్‌లకు వేలాది సంఖ్యలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అధికారులూ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ప్రభుత్వం రీసర్వేకు ఆదేశించడంతో రైతులకు ఊరట కలగనుంది.

రమ్మీ.. జీవితం డమ్మీ!



» పొలం అమ్మి ఆన్‌లైన్ రమ్మీలో కోటీ 40 లక్షలు పోగొట్టుకున్న వైనం

» ఆపై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

» యథేచ్ఛగా రమ్మీ ఆన్‌లైన్ గేమ్.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేకాటే

» బానిసలైపోతున్న యువతరం.. ఇదో రకం లూటీ

» రోడ్డునపడుతున్న కుటుంబాలు.. నియంత్రణ సాధ్యమేనా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : అతడిది కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రామన్నపాలెం. ఉప్పాడ సెంటర్లో వాహనాల స్పేర్‌పార్టుల వ్యాపారం. తండ్రికి ఉన్న 90 సెంట్ల పొలాన్ని రూ.కోటి36లక్షలకు విక్రయించాడు. ఈ సొమ్ముతో వేరేచోట పొలం కొనాలి. కానీ ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌లో ఈ మొత్తం సొమ్ముతోపాటు మరో రూ.4లక్షలు సైతం దఫదఫాలుగా ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో ఈనెల 8న పురుగుమందు తాగేశాడు. వెంటనే కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అప్పుడు అసలు విషయం వెలుగుచూసింది. ఈ తరహాలోనే ఆన్‌లైన్ రమ్మీ క్యాష్ గేమ్స్‌లో ఆడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నవారు, ఇళ్లు, పొలాలు అమ్మి మరీ ఆడిన వారు, కళాశాలల్లో ఈ గేమ్‌కు బానిసలై చదువులు అటకెక్కినవారు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. నిజానికి పేకాట ఆడటం నేరం. ఎక్కడైనా పేకాట ఆడితే వారిని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. కానీ అదే పేకాట ఆన్‌లైన్‌లో ఆడితే కేసులు ఉండవు. ఇదే అదనుగా సరదాగా ఆడుకున్న రమ్మీ ఆటను పెద్ద జూదంగా మార్చేశారు. ఇంట్లో, ఆఫీసుల్లో, బస్టాండుల్లో, రెస్టారెంట్లలో, పార్కుల్లో, ఇంట్లో ఖాళీగా ఉన్న సమయంలో రాత్రి పగలూ తేడా లేకుండా ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట ఆడేస్తున్నారు. వీటిని నియంత్రించే పరిస్థితి కూడా లేదు. వాస్తవానికి పేకాట ఆన్‌లైన్‌లో ఆడటం కూడా అధికారికంగా కుదరదు. కానీ కొంతమంది ఈ పేకాటను ఎక్కడో గోవా, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, ముంబై, కలకత్తా, పంజాబ్, ఢిల్లీ వంటి ప్రాంతాల నుంచి ఆపరేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో రమ్మీని ఆడిస్తూ కోట్లాది రూపాయలు లాగేస్తున్నారు. రమ్మీలో తొలుత డబ్బులు వచ్చేలా చేసి అలవాటు చే



యడం ద్వారా ఆటగాళ్లకు వలవిసురుతారు. ఈ వలలో పడ్డ ఆటగాడు విలవిల కొట్టుకుని చివరికి అప్పులు పాలై ఊరువదిలి పెట్టి పారిపోయే పరిస్థితి. ముఖ్యంగా యువత ఈ రమ్మీ గేమ్‌ల వైపు ఆసక్తి చూపడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో తొలుత చిన్న ప్రారంభమైనా క్రమేపీ లక్షల్లోకి ఈ గేమ్ వెళ్లిపోతుంది. దీనికి మళ్లీ కొంతమందితో ప్రమోట్ చేయించడంతో చాలామంది యువత ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. యువతతోపాటు పెద్దవాళ్లు కూడా ఈ ఆటలకు బానిసలు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతుంది. కొంతమంది సామూహాన్ని ఒకచోట కేంద్రీకృతం చేసి వారు కార్డులను వారికి ఓపెన్‌గా చూసుకుని గేమ్ ఆడి దానిని ఆ గ్యాంగ్‌లోని వారే షో కొట్టేవిధంగా వ్యూహత్మకంగా ఇది నడుస్తుంది. దీనివల్ల వివిధ ప్రాంతాల నుంచి ఆడేవారంతా నష్టపోతారు. నగదు అంతా ఈ గేమ్ నిర్వహించే ముఠాకే వెళ్లిపోతుంది. దీన్ని ఆధారాలతో పట్టుకునే వారే ఉండరు. ఆన్‌లైన్ పేకాటలు, బెట్టింగ్ యాప్‌లపై ఎటువంటి ఫిర్యాదు ఉండడంలేదు. దీనికి కారణం ఆన్‌లైన్ జూదంలో సొమ్ములు పోగొట్టుకున్నామని చెప్పుకోలేరు. ఒకవేళ చెబితే తొలుత చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు కాబట్టి దాంతో విషయం వెలుగుచూసే అవకాశం ఉండదు. ఈ తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మరెన్నో కుటుంబాలు రోడ్డునపడతాయి.

73373 59375

ఈ నెంబర్‌కు వాట్సాప్ చేస్తే ధాన్యం కొనుగోలు షెడ్యూలింగ్

సాంకేతికత సహాయంతో ప్రజల ఇబ్బందులను సాధ్యమైనంత దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే రైతులకు బకాయి లేకుండా ధాన్యం సొమ్ములను ఖాతాలో వేయడంలో మెరుగైన వ్యవస్థను ఏర్పాటుచేసింది. దీనిలో భాగంగానే ధాన్యం విక్రయాల సమయంలో రైతన్న ప్రయాసను తగ్గించే ఏర్పాటుచేసింది. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి గంటల తరబడి బస్తాలతో వేచివుండే ఇబ్బందికి చెక్ పెట్టడానికి వాట్సాప్ షెడ్యూలింగ్ నెంబరును అందుబాటులోకి తెచ్చింది. ఈనెల 5న ధాన్యం కొనుగోలు ప్రారంభించిన నాటి నుంచే ఆ నెంబరు పనిచేస్తోంది. ఈ-క్రాప్‌లో నమోదై ఉన్న నెంబరు కలిగిన ఫోనులో రైతు ముందుగా 7337359375 నెంబరును సేవ్ చేసుకోవాలి. రైతు నెంబరు నుంచి ఆ వాట్సాప్ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పెట్టాలి. వెంటనే 'పౌర సరఫరాల సంస్థకు స్వాగతం, ధాన్యం అమ్మడానికి షెడ్యూల్ చేసుకోండి' అనే జవాబు వస్తుంది. దానిలోని షెడ్యూల్‌పై క్లిక్ చేసి రైతు తన ఆధార్ నెంబరును నమోదు చేయాలి. రైతు పేరు, ధాన్యం విక్రయించాల్సిన కొనుగోలు కేంద్రం పేరు కనిపిస్తాయి. కొనుగోలు కేంద్రంపై క్లిక్ చేయగానే.. ధాన్యం అమ్మే తేదీని ఎంచుకోవాలనే మెసేజ్ వస్తుంది. నచ్చిన తేదీని ఎంపిక చేయగానే టైమ్ స్లాట్లు కనిపిస్తాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ మూడు స్లాట్లు, ధాన్యం రకాలు అందుబాటులో ఉంటాయి. వాటిని ఎంచుకొని ఆ సమయానికి అమ్మకానికి ధాన్యం తీసుకెళితే సరిపోతుంది. కాగా.. జిల్లాలో 216 కొనుగోలు కేంద్రాలను ఈ నెల 5న ప్రారంభించిన విషయం తెలిసిందే. 2.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా.. ఇప్పటివరకూ 10 వేల టన్నులు కొనుగోలు చేశారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పెట్టుబడితో రండి.. భరోసా మాది : దుర్గేష్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో పెట్టుబడులతో వస్తే మిగతా భరోసా తమదని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. ముంబైలో జరిగిన దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ రెండో రోజున నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ ప్రతినిధులతో మాట్లాడారు. రెండు రోజుల పర్యటనలో 45 ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఆసక్తి కనబరచారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

పన్నుల వసూళ్లలో ఆర్ఎంసీకి రెండో స్థానం



ఉత్తమ అవార్డును అందుకుంటున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రెండో స్థానంలో నిలిచింది. గురువారం విజయవాడలో జరిగిన వర్క్‌షాపులో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఉత్తమ అవార్డు, నగదు బహుమతులను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, సీడీఎంఏ సంపత్‌కుమార్ చేతుల మీదుగా అందించారు.



గ్యాస్ ధర ఒకేసారి రూ.50కి పెంచడంపై ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గ్యాస్ సిలిండర్‌పై ఇంత భారం మోపడం దారుణమని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా వామపక్ష పార్టీలు, వాటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ ధరల పెంపు విషయంలో పునరాలోచన చేయాలని, సామాన్యులపై భారాన్ని మోపకుండా చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

గ్యాస్ ధరల మంటలు!

» సిలిండర్ ధర రూ.50 పెంపు

» వినియోగదారులపై అదనపు భారం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ సిలిండర్ ధర చమురు కంపెనీలు ఒక్కసారిగా రూ.50 పెంచేయడంపై ఇప్పటికీ ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అమాంతం పెరిగిన ఈ ధరతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 17 లక్షల 97వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధరను పెంచడంతో వినియోగదారులు రూ.8 కోట్ల 98లక్షల వరకు అదనంగా చెల్లించాల్సి ఉంది. దీనిలో కాకినాడ జిల్లాలో 6 లక్షల 92 వేల కనెక్షన్లు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 లక్షల 30వేల గ్యాస్ కనెక్షన్లు, తూర్పుగోదావరి జిల్లాలో 5 లక్షల 70వేల వరకు కనెక్షన్లు ఉన్నాయి. కాకినాడలో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.831 ఉండగా తాజాగా పెరిగిన ధరలతో రూ.881 పెట్టి వినియోగదారులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. పెరిగిన ధరలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఉజ్వల పథకంలో ఒక సిలిండర్ ధర రూ.503 ఉండగా అది కాస్తా రూ.553కు ధర పెరిగింది. పెరిగిన ధరలపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్యాస్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, వాటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం కలెక్టరేట్ల వద్ద నిరసన ప్రదర్శనలు చేయడంతోపాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా మండలాలు, డివిజన్ల స్థాయిలో కూడా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు.

హానికర పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకం : ఎమ్మెల్యే నల్లమిల్లి 8



బండారులంకలో మగ్గంపై నేత నేస్తున్న కార్మికురాలు

"టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు జనతా వస్త్రాల పథకంతో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించారు. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం చేనేత ముడి సరుకులైన చిలపనూలుపై 20 నుంచి 40శాతం రాయితీ ఇచ్చింది. అంతేకాదు మిల్లు వస్త్రాల పోటీని తట్టుకునేందుకు చేనేత వస్త్ర ఉత్పత్తులపై 20 నుంచి 30శాతం రాయితీ ఇచ్చి విక్రయాలు చేసుకునే సదుపాయం కల్పించారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేత సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం పాడేసింది. నేతన్న నేస్తంతో చేతులు దులుపుకుంది. దాంతో చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు కోట్ల రూపాయల మేర బకాయిలు విడుదల చేయకుండానే ఐదేళ్లూ గడిపేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేత కార్మికుల్లో ఆశలు చిగురించాయి. వారి ఆశలను అడియాశలు చేయకుండా గతంలో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఒక్కో పథకాన్ని తిరిగి అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది."



బండారులంకలో అల్లు పడుతున్న కార్మికులు

చేనేత రంగానికి జవసత్వాలు

చేనేత కార్మికుల సంక్షేమానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

నేతన్నల సృజనాత్మకతతో బయటకు వచ్చిన జమదానీ చీరలకు లభించిన గుర్తింపు అంతా ఇంతా కాదు. ఏకంగా పేటెంట్ హక్కు దక్కించుకున్న ఘనత దీనిదే. ఉప్పాడలో తయారవుతున్న జమదానీ చీరలను ఇప్పుడు కోనసీమ జిల్లాలోని పలు చేనేత గ్రామాల్లో సైతం నేస్తున్నారు. హసన్‌బాద్‌లో తయారయ్యే దుప్పట్లు, తువ్వాళ్లు, పులగుర్తలో ఖాదీ వస్త్రాలు, షర్టింగ్ క్లాత్స్, కె.జగన్నాథపురం, విలసవిల్లి గ్రామాల్లో పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, బండారులంక, జగ్గన్నపేట, కేశనపల్లి, మండపేట, మోరి, ముమ్మిడివరం, పెనుమల్ల, పుల్లేటికుర్రు, ఆదివారపుపేట, అంగర, రాయవరం తదితర చేనేత గ్రామాల్లో తయారయ్యే చేనేత బుటా నేత చీరలు, జాకార్డ్, లుంగీలు, తివాచీలతో పాటు దివాన్‌సెట్లు, పిల్లో కవర్లు, కుప్పడం పంచెలు మంచి గుర్తింపు పొందాయి. రూ.300 నుంచి రూ.3లక్షలు విలువ చేసే చేనేత చీరలను తయారు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై జిల్లాలోని ఒక్కో చేనేత సహకార సంఘం లక్షలాది రూపాయల నుంచి కోట్ల రూపాయల మేర అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నాయి. వారిని ఆదుకుని తిరిగి చేనేత రంగానికి జవసత్వాలు నింపే విధంగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలో 5వేల కుటుంబాలకు పైబడి ఉచిత విద్యుత్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనుంది. ఇప్పటికే ప్రభుత్వం జీవో నెం.44 జారీ చేసింది. పవరలూమ్‌లకు 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తారు. రెక్కాడితేగానీ డొక్కాడని నేత కుటుంబాలకు విద్యుత్ చార్జీల భారం ఇకపై ఉండదు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసింది. అంతకుముందు చంద్రబాబు ప్రభుత్వం చేనేత మగ్గం ఉన్న కుటుంబాలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ అందించింది. ఇప్పుడు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు అనుబంధ వృత్తులవారికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 5వేలకు పైగా దరఖాస్తులు అందినట్టు ఆ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. త్వరలోనే అర్హులైన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో 23 చేనేత సహకార సంఘాల పరిధిలో 6,150 మంది సభ్యులు ఉన్నారు. వీరితో పాటు మాస్టర్ వీవర్ల వద్ద 1,252 మంది కార్మికులు ఉన్నట్టు చేనేత అధికారులు గుర్తించారు. ఉచిత విద్యుత్ కోసంమరిన్ని దరఖాస్తులు అందే అవకాశం ఉందన్నారు.

జిల్లాకు త్వరలో రూ.90 లక్షల త్రిఫ్ట్ ఫండ్ నిధులు

కె.పెద్దిరాజు
చేనేత-జౌళి శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చేనేత సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ నెలలో రూ.1.10 కోట్లమేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల కానున్నాయి. గత ప్రభుత్వంలో త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి ప్రత్యేకంగా కోనసీమ జిల్లాలోని 23 చేనేత సహకార సంఘాలకు సంబంధించి అత్యధికంగా రూ.90లక్షలు విడుదల కానున్నాయి. త్వరలోనే ఖజానా శాఖ కార్యాలయం నుంచి ఇవి రానున్నాయి. కార్మికుని వేతనం రూ.100 ఉంటే త్రిఫ్ట్ ఫండ్ కింద చేనేత సంఘాలు రూ.8 జమ చేస్తాయి. తిరిగి ఆ కార్మికునికి రూ.16 జతకలిపి మొత్తంగా రూ.24 చొప్పున చెల్లిస్తారు. అంటే ఒక కార్మికుడు నెలలో రూ.3వేలు వేతనం పొందితే అతనికి అదనంగా రూ.720 దక్కుతుంది.

రాయితీ బకాయిలు విడుదల చేయాలి

చింతా శంకరమూర్తి, మాజీ జడ్పీటీసీ, బండారులంక



జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు 20 నుంచి 40 శాతం చిలపనూలు సబ్సిడీపై రూ.3.55 కోట్లు బకాయిలు ఉన్నాయి. 20 నుంచి 30 శాతం చేనేత వస్త్రాల రిబేటు పథకంలో రూ.2.81 కోట్లు బకాయిలు ఉన్నాయి. పావలా వడ్డీ రాయితీ కింద రూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్ల బకాయిలు జిల్లాలోని చేనేత కార్మికులకు, సహకార సంఘాలకు చెల్లించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నీ విడుదల చేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలి.

మార్కెటింగ్ సదుపాయం మెరుగుపరచాలి

దొంతంశెట్టి సత్యప్రకాష్, లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్



చేనేత సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఇప్పటికే పలు సంఘాలు ఆన్‌లైన్‌లో వస్త్ర వ్యాపారానికి శ్రీకారం చుట్టాయి. ఈ విధానాన్ని ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలి. చేనేత వస్త్ర ఉత్పత్తుల విక్రయాలను కేవలం ఆప్కోకు మాత్రమే పరిమితం చేసే విధానానికి స్వస్తి పలకాలి. మరమగ్గాల ధాటికి తట్టుకునేలా చేనేత వస్త్రాలపై 30 శాతం రాయితీ ఇవ్వాలి. అంగన్వాడీలు సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి అమలు చేస్తున్న డ్రెస్‌కోడ్‌లో భాగంగా చేనేత వస్త్రాలనే వినియోగించేలా ప్రభుత్వం చొరవ చూపాలి.

నేతన్నకు చంద్రన్న చేయూత

200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ ప్రకటనపై హర్షాతిరేకాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. ఈ క్రమంలో చేనేతలకూ చేయూత ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఉన్న వంద యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతామని స్పష్టం చేశారు. పవర్ లూమ్‌కు కూడా 500 యూనిట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. వీటిని అమలు చేస్తామని సీఎం ప్రకటించడంతో కాకినాడ జిల్లాలోని చేనేత కుటుంబాలు చంద్రబాబుపై అభినందనల జల్లు కురిపించాయి.

ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగం

కాకి మంగ, చేనేత కార్మికురాలు, వాకతిప్ప, కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా



ఇద్దరు పిల్లలతో కుటుంబం ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయింది. మరోవైపు అప్పటి పలు రకాల పరిస్థితుల్లో చేనేత రంగంతో పాటు నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ నేపథ్యంలో చేనేత రంగ అభివృద్ధిలో భాగంగా ఉచిత విద్యుత్‌ను ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది.

మాట మార్చలేదు... మడమ తిప్పలేదు

ఇంధన లోవబాబు, చేనేత కార్మికుడు



ఎన్నికల హామీలు నెరవేర్చే క్రమంలో కూటమి ప్రభుత్వం మాట మార్చలేదు, మడమ తిప్పలేదు. నేతన్నల నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్‌లూమ్‌కి 500 యూనిట్లు అందిస్తున్నట్టు ప్రకటించడం ఆనందదాయకం.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

పొన్నగంటి సత్యనారాయణ, అఖిల భారత పద్మశాలీ సంఘం కార్యదర్శి, కాకినాడ పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు



చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చుకోవడం పట్ల నేతల కుటుంబాలన్నీ సంతోషంగా ఉన్నాయి. చేనేతల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందరూ కృతజ్ఞతలు చెప్తున్నారు.

పెరుగులంకలో చెరువుల తవ్వకాలపై విచారణ



విచారణ చేస్తున్న తహశీల్దార్ విజయశ్రీ

ఐ.పోలవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరి పెరుగులంక భూముల్లో కొనసాగుతున్న రొయ్యల చెరువుల తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం, ముమ్మిడివరం, తాళ్లరేవు, కె.గంగవరం మండలాల పరిధిలో గోదావరి చెంత ఉన్న పెరుగులంక భూముల్లో ఆక్వా చెరువుల తవ్వకాలు జరుగుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. పెరుగులంక భూముల్లో అక్రమంగా చెరువులు తవ్వుతూ నిబంధనలకు విరుద్ధంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ పశువుల్లంకకు చెందిన చీకురుమిల్లి తాతారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం పెరుగులంక భూముల్లో పర్యటించి వివరాలు సేకరించారు. తహశీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డిప్యూటీ తహశీల్దార్ మహాలక్ష్మీనాయుడు, మండల సర్వేయర్ మహేష్‌తో పాటు వీఆర్వోల బృందం ఆక్వా చెరువుల తవ్వకాలను పరిశీలించారు. పశువుల్లంక, కొమరగిరి గ్రామాల సరిహద్దుల్లో జరుగుతున్న చెరువుల తవ్వకాలకు రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. మండల పరిధిలో సుమారు 427 ఎకరాలు పెరుగులంక భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ భూమిలో చెరువుల తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం విచారణ చేపట్టింది. ముందుగా ఆయా మండలాల పరిధిలో ఉన్న పెరుగులంక భూములను గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.

జీడిపప్పు కార్మికులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- మోరి, మోరిపోడులో జీడిపప్పు పరిశ్రమల సందర్శన



మోరి ఫ్యాక్టరీలో జీడిపప్పుని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అందరికీ మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విద్యుత్ సమస్యలతో మోరి, మోరిపోడులో నష్టపోయిన జీడిపప్పు పరిశ్రమలను, కార్మికులను ఆయన సందర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరి జీడిపప్పు పరిశ్రమపై పరిసర గ్రామాల కార్మికులు ఆధారపడి ఉన్నారని, జీడిపప్పును కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రభుత్వపరంగా చేయూతనిచ్చే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. గత రాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బ్రేకర్లు ఫెయిల్ అయి విద్యుత్‌లో హెచ్చుతగ్గుల వల్ల జరిగిన కారణంగా సుమారు రూ.5-రూ.6 లక్షలు నష్టం జరిగిందని, పలు ఫ్యాక్టరీల్లో మోటార్లు కూడా కాలిపోయినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. మోరి, మోరిపోడులోని 12 జీడిపప్పు పరిశ్రమలకు చిన్నతరహా పరిశ్రమల ద్వారా ఉండే రాయితీలు వచ్చేవిధంగా సంబంధిత మంత్రితో మాట్లాడతానన్నారు. ఈ పరిశ్రమలకు విద్యుత్ రాయితీ పై మంత్రితో చర్చిస్తానన్నారు. ఫ్యాక్టరీ యజమాని ముప్పర్తి సుబ్బారావు జరిగిన నష్టం తీరును ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎల్ఐ ప్రసాద్, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణి, పినిశెట్టి బుజ్జి, రావూరి నాగు, బళ్ల రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏడీపై సీఎంతో మాట్లాడా

రాజోలు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు సుదీర్ఘ కాలం నుంచి పనిస్తున్న ఎలక్ట్రికల్ ఏడీఈ పనితీరే కారణమని ఎమ్మెల్యే వరప్రసాద్ అన్నారు. అతను సుదీర్ఘ కాలం నుంచి ఉండడంతో పాటు సరిగా స్పందించకపోవడంతో ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అతని స్థానంలో కొత్తవారిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎండీ, ఎస్ఈలతో మాట్లాడారు.

వెంకన్న ఆలయంలో కన్నుల పండువగా సదస్యం



వెంకన్న ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు



ఉత్సవమూర్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం స్వామివారికి మేలుకొల్పు, తీర్థపు బిందెతో గోదావరి జల సంగ్రహణ, నీత్యార్చన, నిత్యమహోమాలు, దిగ్దేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ద్రవిడ వేద పారాయణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం విశ్వక్సేన పూజ, అష్టదిపాలకన ఆరాధన, సదస్యం వైభవంగా నిర్వహించారు. చతుర్వేద పండితులతో మహాదాశీర్వచనం కన్నుల పండువగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో ప్రధాన హోమాలు, దిగ్దేవత బలిహరణ జరిపారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ఆరోగ్య ఉపశాఖాధికారిణి డాక్టర్ సుమలత, ఎంపీడీవో వెంకటరామన్, రావులపాలెం ఆర్టీసీ డీఎం రమణ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారందరికీ పండితులు శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు.



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు స్వామివారి శేషవస్త్రం సమర్పించిన దృశ్యం

నేడు చేబ్రోలులో గుర్రాల ప్రదర్శన పోటీలు



పోటీలకు తరలివచ్చిన గుర్రాలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు జరగనున్నాయి. చేబ్రోలు బైపాస్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం చెంతనే ఉన్న రోడ్డులో సీతారామస్వామి ఆలయ కమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గుర్రాలు ఇప్పటికే తరలివచ్చాయి. చేబ్రోలులో తొలిసారి జరుగుతున్న పోటీలు కావడంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీల్లో తొలి పది స్థానాలు సాధించిన గుర్రాలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జూహితకు గోల్డ్‌మెడల్



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్రీడా కీర్తి దేశవ్యాప్తంగా ఇనుమడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరానికి చెందిన విద్యార్థి జూహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటి గోల్డ్‌మెడల్ సాధించింది. మణిపూర్‌లోని ఇంఫాల్ నగరంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు అండర్-17 విభాగంలో రాజమహేంద్రవరంలోని లాలాచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థిని జూహిత గుణ గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే జూహిత గుణ ప్రతిభను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

సామర్లకోట మీదుగా ప్రత్యేక రైళ్లు

చర్లపల్లి-నహరలగున్ మధ్య ఆరు ఎక్స్‌ప్రెస్‌లు

సామర్లకోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవు రోజుల్లో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైలు ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ప్రయాణికులకు మరింత సేవలందించేందుకు ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి-నహరలగున్ మధ్య సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు అందుబాటులోకి తెస్తున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని రాత్రి ఆంధ్రజ్యోతి సేకరించింది. 07046 నంబరు గల చర్లపల్లి-నహరలగున్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12,19,26లలో ప్రతీ శనివారం చర్లపల్లి నుంచి ఉదయం 8.40 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం స్టేషన్‌కు సాయంత్రం 5గంటలకు చేరుకుని సామర్లకోటకు 6.05గంటలకు చేరుతుంది. తిరిగి ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం నార్త్, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెరహమ్‌పూర్, బాలూగాన్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, జైపూర్ కోయింజహార్ రోడ్, భద్రక్, బాలేశ్వర్, ఖరగపూర్, అండుల్, డంకుని, బార్ధమన్, బోలాపూర్ శాంతినికేతన్, రాంపూర్ హాల్ట్, మాల్డా టౌన్, కిషన్‌గంజ్, అలూబరి రోడ్, న్యూ జలపాయిగురి, దూప్‌గురి, న్యూకోచ్ బెహరి, న్యూ అలిపురదార్, కొక్రాజిహార్, న్యూ బొంగాయ్‌గాన్, బారాపేట రోడ్, రంగియా, ఉదల్‌గురి, రంగపారా నార్త్, హారముతిల మీదుగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని నహరలగున్ స్టేషన్‌కు సోమవారం సాయంత్రం 4 గంటలకు చేరుతుంది. 07047 నంబరు గల అరుణాచల్ ప్రదేశ్ నహరలగున్ నుంచి చర్లపల్లి మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15, 22,29లలో నహరలగున్ నుంచి ప్రతీ మంగళవారం మధ్యాహ్నం 13.00గంటలకు బయలుదేరి సామర్లకోటకు మధ్యాహ్నం 10.10గంటలకు చేరుకుని కాకినాడకు రాజమహేంద్రవరంనకు 10.58గంటలకు చేరుతుంది. చర్లపల్లి స్టేషన్‌కు గురువారం రాత్రి 9.30 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైలులో సెకండ్ ఏసీ-1, థర్డ్ ఏసీ-5, స్లీపర్ క్లాస్-10, ఎల్ఎస్ఎల్ఆర్డీ-1, ఈవోజీ-1 చొప్పున 18 ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణికులకు సేవలందించనుంది.

ఈ రైళ్లల్లో ప్రయాణించే వారు రిజర్వేషన్ టిక్కట్లు తదితర సమాచారం కోసం ఆయా సమీప స్టేషన్లలోను బుకింగ్ కార్యాలయాలలోను సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన లేఖలో తెలిపారు.

ఏమ్మా.. ఎలా ఉన్నారు?



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆవ రోడ్డులో ఏకలవ్య బాలల వసతిగృహం, బొమ్మూరులోని బాలికల వసతి గృహాలను డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ గురువారం సందర్శించారు. వసతి పొందుతున్న వారికి అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. వారికి సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం అందించాలని, వైద్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ వహించవద్దని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి యోగక్షేమాలను ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా, న్యాయ సహాయం అవసరమైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీఎల్ఎస్ఏ తరఫున తగు చర్యలు తీసుకోడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

శృంగారవల్లభుడి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



పెద్దాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతిలోని శృంగారవల్లభ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సుమారు 500 మంది ముత్తయిదువులు ఉచిత సామూహిక కుంకుమార్చన చేశారు. వారికి దేవస్థానం తరఫున పూజా సామగ్రి ఉచితంగా అందజేసి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమనారాయణాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, అంజనీకుమార్, సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజ్ఞాన గని 'యనమల'



సభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

- సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు
- అధిరోహించిన పదవులన్నింటికీ వన్నెతెచ్చిన నేత
- సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేతగా పేరొందారు
- యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభలో కొనియాడిన స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- సభకు తరలివచ్చిన నేతలందరికీ కృతజ్ఞతలు : యనమల



సభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే దివ్య



పాటలు పాడుతున్న వందేమాతరం శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

కాకినాడ/తునిరూరల్ ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ సీనియర్ నేత యనమల రాజకీయ విజ్ఞాన గని. అమరావతి నుంచి అమెరికా వరకు అనేక అంశాలను నిత్య విద్యార్థిలా చదువుతూ అందరికీ వివరిస్తూ ఎంతోఖ్యాతి గడించారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు, మంత్రులకు యనమల రాజకీయ గురువు. 42ఏళ్ల రాజకీయాల్లో ఆయన చూడని పదవులు, హోదాలు లేవు. ఇన్నేళ్ల రాజకీయాల్లో ఏరోజు గర్వపడడం కానీ, కుంగిపోవడం కానీ ఎరుగని నాయకుడు. సంక్షోభాలు, సమస్యలు ఎదురైనా చెక్కుచెదరకుండా శ్రీకృష్ణుడిలా చిరునవ్వుతూ కనిపించే యనమల రాజకీయ రారాజు' అని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, అచ్చెన్న, నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు కొనియాడారు. కాకినాడజిల్లా తునిలో యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలిరావడంతో తుని పట్టణంలో సాయివేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భారీ బాణసంచా మిరిమిట్ల మధ్య సభ పండుగ వాతావరణంలో కళకళలాడింది.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇతర నేతలతో కలిసి యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకుముందు అక్కడే ఏర్పాటు చేసినయనమల ఫొటోగ్యాలరీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. గ్యాలరీలో యనమల చిన్ననాటి నుంచి నేటివరకు ఏర్పాటు చేసిన ఫొటోలు ఆకట్టుకున్నాయి. హోంమంత్రి అనిత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగిన యనమల తూర్పుగోదావరి జిల్లాకు ఎంతో ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. రాజకీయాల్లో విలువైన వ్యూహకర్తగా పేరొందారని కొనియాడారు. అర్హత ఉన్న వారికి జరుగుతున్న సన్మానం అని పేర్కొన్నారు. యనమల సంస్కారం, సమర్థతతో ఎందరికో రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎన్టీఆర్‌కు యనమల ముద్దుబిడ్డగా మారారని, ఎందుకు యనమలను అంతగా ఇష్టపడ్డారో తెలియలేదన్నారు. 11సార్లు ఆర్థిక మంత్రిగా పనిచేయడం అరుదైన రికార్డు అని వివరించారు. మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, నారాయణ ప్రసంగిస్తూ యనమల నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఎంతోమంది ఎమ్మెల్యేలకు అనేక విషయాలు నేర్పినవారు రాజకీయంగా మరింత ఎదిగేలా సహకరించారని గుర్తుచేశారు. అనేక రాజకీయ సంక్షోభాలప్పుడు ఆయన్ను కలవడానికి వెళ్లినప్పుడు చిరునవ్వుతో ఒత్తిడి లేకుండా కనిపించడం ఆయనకు మాత్రమే సాధ్యమని వివరించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు తామంతా యనమల నుంచి ఎంతో నేర్చుకున్నామన్నారు. అవకాశాలు అందరికీ వస్తాయని, వాటిని అందిపుచ్చుకుని నిలబడడం యనమలకు మాత్రమే సాధ్యమన్నారు. యనమల, కింజరపు, గౌతు, ప్రతిభా భారతి తదితర కుటుంబాలు ఎప్పుడూ నారా కుటుంబానికి అంకితమన్నారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ యనమలకు కొడుకులు లేరని రాజకీయ వారసత్వం కనుమరుగు అయిపోతుందన్న ఆవేదన తనకు ఉండేదని, కానీ దివ్య రాకతో ఆ కొరత తీరిందని అన్నారు. రాజకీయాల్లో పదవులు లేకపోయినా క్రమశిక్షణగా ఉండాలని, పదవులు లేవని, అన్యాయం జరిగిందని అంటే ఎదగలేమని అన్నారు. యనమల ఎప్పుడూ టీడీపీకి గైడ్‌గా ఉండాలని కోరారు. యనమల సలహాలు పార్టీకి, నేతలకు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ యనమల రాజకీయాల్లో వటుడంతడిలా ఎదిగారన్నారు. ఆయనలో తాను ఎప్పుడు కోపం, ఆవేశం చూడలేదన్నారు. అందుకే తనకు యనమలను చూస్తే ఈర్ష్యగా ఉందని చమత్కరించారు. యనమల దేశస్థాయిలో మంచి పదవులలోకి వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం తుని ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ తన తండ్రి గురించి మంత్రులు అందరూ గొప్పగా మాట్లాడడం చాలా సంతోషంగా ఉందని, ఆయన నుంచి ఇంతమంది నేతలు ఎన్నో నేర్చుకోవడం తనకు గర్వకారణంగా అనిపిస్తుందని అన్నారు. ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలను పక్కన కూర్చోబెట్టుకుని యనమల సలహాలు, సూచనలు ఇచ్చారని తాను ఎప్పుడైనా ఏదైనా అడిగితే పోయి పుస్తకం చదువుకో అనేవారని అని సరదాగా వ్యాఖ్యానించారు. అనంతరం ఎమ్మెల్యేలు బుచ్చిబాబు, ఆనందరావు, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, కాకినాడరూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ, సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. యనమల తెలుగుదేశం పార్టీకి అత్యంత విలువైన నేతగా కొనియాడారు. తామంతా కష్టసుఖాలు ఎప్పుడు యనమలతో పంచుకుంటూ ఆయన అనుభవాల నుంచి ఎన్నో నేర్చుకున్నామని గుర్తు చేశారు. సభా కార్యక్రమంలో ఆఖరిలో ప్రసంగించిన యనమల తన 42ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని నెమరువేసుకున్నారు. చిన్న వయస్సులో ఎన్టీఆర్ టిక్కెట్ ఇచ్చి ప్రోత్సహించారని గుర్తు చేశారు. అనంతరం చంద్రబాబుతో కలిసి సుదీర్ఘంగా పనిచేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 38ఏళ్ల కేబినేట్ హోదాలో కొనసాగడం పార్టీ తనకు ఇచ్చిన గౌరవంగా భావిస్తానన్నారు. సభకు ఇంతమంది రావడం ఆనందం కలిగిస్తోందన్నారు. సభా కార్యక్రమంలో తొలుత యనమల ప్రస్థానంపై ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన అందరినీ అలరించింది. సభావేదికకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరై యనమలకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సభా కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కదులుదాం రండి మనం.. జన్మభూమికి.. గీతాన్ని ఆలపించి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిమంది కార్యకర్తలు, నాయకులు తరలిరాగా యనమల వారికి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

వ్యాపారి కిడ్నాప్ కలకలం

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కిడ్నాప్‌కు గురైన వ్యాపారి శిరగం మురళీహరసుబ్బారావు

రావులపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రావులపాలెంనకు చెందిన ఓ వ్యాపారి కిడ్నాప్ అయిన ఘటన కలకలం రేకెత్తిచింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని ఆదిలక్ష్మీనగర్ ఐదో వీధిలో నివాసం ఉంటున్న శిరగం శ్రీరామ్(రమేష్) నాలుగు సంవత్సరాల క్రితం మహారాష్ట్రకు చెందిన సంజయ్ అనే వ్యక్తితో వ్యాపారంచేసి బాకీపడ్డాడు. బాకీ విషయమై వేధిస్తుండగా పెద్దలలో చర్చించుకున్నారు. ఇదిలావుండగా శ్రీరామ్ తండ్రి బుధవారంరాత్రి 12.30కు ఇంటికి ఫోన్‌చేసి పని ముగించుకుని వచ్చేస్తున్నట్లు తెలిపాడన్నారు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అతడి కోసం వెతుకుతుండగా మార్గమధ్యంలో గునిశెట్టి నాగేంద్ర ఇంటి సమీపంలో మురళీహర సుబ్బారావు మోటార్ సైకిల్, చెప్పులు, కళ్లజోడు ఉండటాన్ని కుమారుడు గుర్తించాడన్నారు. గురువారం ఉదయం తండ్రి కుమారుడికి ఫోన్‌చేసి సంజయ్ అతని కూడా వచ్చిన వారు బలవంతంగా కారులో ఎక్కించుకుని మహారాష్ట్రకు తీసుకుని వెళుతున్నట్లు తెలిపిన అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. దీంతో శ్రీరామ్ గంటికి చెందిన రుద్ర సురేష్ ద్వారా సంజయ్, రమేష్, గోపయ్య తదితరులు తన తండ్రిని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేవీ రమణారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రంప పీజీఆర్ఎస్ వేదికకు
జడ్పీ సీఈవో నిరాకరణ

- వివాదాస్పదమవుతున్న జిల్లా, మండల పరిషత్ అధికారుల తీరు
- వైసీపీ ప్రజా ప్రతినిధులకు భవనాన్ని ఎలా ఇస్తారంటూ దేశం నేతల ఎద్దేవా

రంపచోడవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తునన్న ప్రజా సమస్యల పరిష్కార(పి.జి.ఆర్.ఎస్) వేదికను అంతే ప్రతిష్మాత్మకంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించేందుకు మాత్రం అధికార యంత్రాంగం అడ్డుపడుతోంది. రంపచోడవరం నియోజకవర్గ స్థాయిలో రంపచడవరం కేంద్రంగా ఎమ్మెల్యే శిరీషదేవి రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్.వేదిక నిర్వహణ కోసం భవనాన్ని కేటాయించాలని కాకినాడలోని ఉమ్మడిజిల్లా పరిషత్ సీఈ వోను కోరారు. కాగా ఇందుకు ఆయన నిరాకరిస్తూ ఎమ్మెల్యేకు సమాచారాన్ని ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ కోసం ఖాళీగా ఉన్న భవనాన్ని అడిగితే అందుకు రంపచోడవరం ఎంపీడీవో సూచనలతో జిల్లా పరిషత్ సీఈవో నిరాకరించడం వివా దంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్మాత్మక కార్యక్రమానికే జిల్లా పరిషత్ సీఈవో అడ్డుతగలడంపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రజా కార్యక్రమం కోసం భవనాన్ని అడిగితే కార్యాలయం కోసం భవనం అడిగినట్లుగా ఎత్తిచూపి నిరాకరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. తాము ప్రజా ప్రయోజన కార్యక్రమానికి అడిగితే వీలులేదని చెప్పిన అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ ఎమ్మెల్సీకి, రంప చోడవరం జడ్పీటీసీ కార్యాలయాన్ని ఎలా కొనసాగింప చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై జిల్లా పరిషత్ సీఈవో, రంపచోడవరం ఎంపీడీవోలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు కూడా ఇక్కడి నేతలు సిద్ధమవుతున్నారు.

ట్రాక్టరు బోల్తా.. వ్యక్తి మృతి

సీతానగరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరు తిరగబడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రఘుదేవపురం ఇటుకబట్టీవద్ద చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు రఘుదేవపురం గ్రామానికి చెందిన ఇటుకబట్టీ యజమాని సిద్దే వెంకటేశ్వర్లు 45 గురువారం ఇటుకబట్టీ వద్ద ట్రాక్టరుతో మట్టి తొక్కుతుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టరు తిరగబడి మట్టిలో కూరుకుపోయాడు. ఇటుకబట్టీ వద్ద ఉన్న వారు ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టరును తొలగించి మట్టిలో కూరుకుపోయిన వెంకటేశ్వరరావును బయటకు తీయగా కొనఊపిరితో ఉన్న అతనిని చికిత్స నిమిత్తం హుటాహుటిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడికి భార్య దుర్గాభవాని వివాహమైన ఇద్దరు కుమార్తెలు కోటేశ్వరి, సంధ్యా రాణిలు ఉన్నారు. భార్య దుర్గా భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీను కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ట్రాక్టరు తిరగబడి మట్టిలో కూరుకుపోయిన వ్యక్తిని బయటకు తీసుకువచ్చిన దృశ్యం, మృతుడు సిద్దే వెంకటేశ్వర్లు





కాకినాడ తీరంలో వైమానిక విన్యాసాలు నిర్వహిస్తున్న యుద్ధ విమానాలు



శత్రువులపై దాడి చేస్తున్న ఆర్మీ సైనికులు

అబ్బురపరచిన
త్రివిధ దళాల విన్యాసాలు

- కాకినాడ సముద్ర తీరంలో టైగర్ ట్రయింఫ్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగరతీరంలో భారత్-అమెరికా దేశాలు సంయుక్తంగా మూడురోజులుగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్-2025 విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. గురువారం సముద్రజలాల్లో భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ జలశ్వ ఆకాశంలో ఐఏఎఫ్ హక్స్ యుద్ధవిమానాలు, యూఎస్ఏకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ సిబ్బంది విన్యాసాల్లో పాల్గొన్నారు. యాంపీబీయస్ విన్యాసాల ఔటర్ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లను కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పా టిల్ ఆధ్వర్యంలో కాకినాడరూరల్ సీఐ డీఎస్ చైతన్యకృ ష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత పర్యవేక్షించారు.

జనావాసాల్లోకి చుక్కల జింక

- అటవీప్రాంతంలో వదిలేసిన ఫారెస్ట్ అధికారులు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా రాజవొమ్మంగి మండలంలోని సూరంపాలెం గ్రామంలో గురువారం తెల్లవారుజామున సమీప అటవీ ప్రాంతం నుంచి చుక్కల జింక ఒక ఇంట్లోకి ప్రవేశించింది. దీంతో గ్రామస్తులు ఇంటి తలుపులువేసి స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారిణి ఉషారాణికి సమాచారం అందించారు. దీంతో ఆమె సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో ఉన్న చుక్కలజింకను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాము, ఫారెస్టు సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.



ఇంటిలో బంధించిన చుక్కల జింక

నేడు ఉమ్మడి జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్ల సమన్వయ సమావేశం

కాకినాడసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఉమ్మడిజిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్ల సమన్వయ సమావేశం ఏర్పాటుచేసినట్లు ఏపీఆర్ఎస్ఏ కాకినాడజిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ కాకినాడజిల్లా చైర్మన్ పితాని త్రినాథ్ తెలిపారు. 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఇదే సమావేశ మందిరంలో ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘాల ప్రతినిధులు, మహిళా విభాగం ప్రతినిధులతో సమావేశం, మధ్యాహ్నం 3గంటలకు క్లాస్-4 ఉద్యోగులు, డ్రైవర్ల సమస్యలపై సమావేశం నిర్వహిస్తామన్నారు.

మహిళ మెడలో ఆభరణాల చోరీ

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో 12గ్రాముల బంగారు ఆభరణాలు లాక్కెళ్లిన సంఘటన బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కె.ఆమని దివాన్‌చెరువు జీఎస్ఎల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తమ బంధువుల ఇంటికి దివాన్‌చెరువు వెళుతుండగా బొమ్మూరు రైస్‌మిల్లు సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమెపై దౌర్జన్యంగా మెడలో ఉన్న బంగారు వస్తువులు లాక్కొనిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదెమ్మదిబ్బకు చెందిన టి.రాము (32) తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 7న రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతన్ని చూసిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరించారు. అయితే పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం ఏపీ తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాంప్రదాయ పడవలు మినహాయించి, ఔట్ బోర్డ్, ఇన్ బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లతో ఈ 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

స్థలం అమ్ముతామని నగదు తీసుకుని మోసం

- పోలీసులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన జి.సురేఖ ఆమె సోదరిలకు దివాన్ చెరువులో 500 గజాల స్థలం ఉందని చెప్పి దానిని విక్రయిస్తామని 2017లో రూ.50 లక్షలు తీసుకుని మోసం చేశారని హుకుంపేటకు చెందిన ఆకుమర్తి చిన్న అనే వ్యక్తి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తనను స్థలం విషయంలో మోసంచేసి డబ్బులు తీసుకున్న సురేఖ, ఆమె సోదరిలు ఇప్పుడు ఆ స్థలం అమ్మకపోగా తనను బెదిరరిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

21న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన ఓ మహిళను అదేప్రాంతానికి చెందిన సయ్యద్ రసూల్ అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని బాధిత మహిళ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో
యువకుడి ఆత్మహత్య



మృతుడు శివన్నారాయణ

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరికిరేవుల గ్రామానికి చెందిన మారిశెట్టి శివన్నారాయణ (24) గత కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. అనారోగ్యంతోపాటు, ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కూలి పనులకు వెళ్లిన తండ్రి సత్యనారాయణ ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్న కొడుకునిచూసి కన్నీటి పర్యంతం అయ్యాడు. మృతదేహాన్ని కిందకు దింపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వడదెబ్బతో నాయీ బ్రాహ్మణుడు మృతి



మరణించిన లక్ష్మణరావు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాజా భజంత్రీలు వాయిస్తూ వడదెబ్బకు గురై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరానికి చెందిన నాయీ బ్రా హ్మణుడు మరణించాడు. గ్రామానికి చెంది న సందిపర్తి లక్ష్మణరావు (50) దుర్గాదేవి ప్రతిష్ఠా కార్యక్రమంలో బాజా భజంత్రీలకు గురువారం వెళ్లాడు. భజంత్రీలు మోగిస్తుండగా ఎండ తీవ్రత తాళలేక వడదెబ్బ తగి లి కుప్పకూలిపోయాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ ఆ ధ్వర్యంలో పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడి చేశారు. 4.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని సరుకు యజమాని కర్రి లక్ష్మీనారాయణను అరెస్టు చేశారు. గొల్లప్రోలు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పాడలో రెండు టన్నుల బియ్యం స్వాధీనం

కొత్తపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి పోలీసులు గురువారం రాత్రి ఉప్పాడలో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గాంధీనగర్‌లో చిత్రాడ దొరబాబు వద్ద నిల్వ ఉంచిన ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అభివృద్ధి పనుల పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రతీ ప్రాంతంలోను మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం ఆయన స్థానిక లింగంపేట, ఆదెమ్మదిబ్బ వాంబే గృహాల్లో పర్యటించి నిర్మాణంలో ఉన్న సీసీ రహదారులు, ప్రధాన డ్రేనేజీల పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 39వ డివిజన్‌లో ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ, రహదారుల పనులు పూర్తి చేస్తున్నామన్నారు. నగరంలో రహదారులు, కాలువల గురించి అడగక ముందే వాటిని నిర్మిస్తున్నామన్నారు. వాంబే కాలనీకి తన తల్లి వీరాఘవమ్మ మొదలుకొని తండ్రి అప్పారావు, భార్య భవాని వరకు సేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు. మీ భద్రత-మా బాధ్యత కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుతో నగరంలో గంజాయి, బ్లేడు బ్యాచ్‌లపై ఉక్కుపాదం మోపామని, ఇంకా అక్కడక్కడ ఉన్నట్టు మహిళలు చెబుతున్నారని, అటువంటివి ఉంటే పోలీసులకు సమాచారమందిస్తే చర్యలు తీసుకుంటారని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతారని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఫూలే, అంబేడ్కర్ అవార్డుల ప్రదానం

బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం చెరుకూరి కళ్యాణ మండపంలో ఈనెల 12న సాయంత్రం 4గంటలకు ఫూలే, అంబేడ్కర్ అవార్డుల ప్రదానోత్సవ సభను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు తెలిపారు. గురువారం స్థానిక తిలక్ రోడ్డులో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో అంబేడ్కర్ అవార్డును ప్రముఖ ఉద్యమ నేత అంబేడ్కర్ వాది జేబీ రాజుకు, ఫూలే అవార్డును బీసీ నేత, సంఘ సేవకుడు, ఎంతో మంది పేద విద్యార్థులకు ఫీజులు కట్టి చదివిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. సమావేశంలో సంఘం వైస్ ఛైర్మన్ ఎల్వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జార్జి అంటోని, కోశాధికారి రాచర్ల నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన నిరుద్యోగులకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో జె. ఝూన్సీ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ రుణాలను ఇండివిడ్యుయల్ బ్యాంకు సెక్టార్, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్, అగ్రికల్చర్ సెక్టార్లలో వివిధ కేటగిరీల్లో యూనిట్లు మంజూరు చేస్తారన్నారు. దరఖాస్తులను ఈ నెల 14నుంచి మే 10వరకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగి తెల్లరేషన్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, మొబైల్ కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన లబ్ధిదారులు మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

పశువుల మందులు అందుబాటులో ఉంచాలి

పశుసంవర్ధక శాఖాధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



పశుసంవర్ధక శాఖాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పశువులకు అవసరమైన అన్ని రకాల మందులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖాధికారులతో ఎమ్మెల్యే రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో గురువారం సమీక్షించారు. పశువులకు సక్రమంగా మందులు అందుబాటులో ఉండడం లేదని తన దృష్టికి వచ్చిందని, ఇక నుంచి పశువైద్యానికి సంబంధించిన అన్ని రకాలైన మందులను గ్రామాల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే విత్తనాలు, దాణా, వ్యాక్సిన్లు తదితర అంశాలపై సమీక్షించారు. పాడిరైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. తోకాడ, నరేంద్రపురం గ్రామాల్లో వెటర్నరీ డిస్పెన్సరీలను ఏర్పాటు చేసే యోచన ఉందని, అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఏడీఏలు, వీఏఎస్‌లు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థుల పరిశ్రమల సందర్శన

రాజానగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విద్యార్థులు గురువారం పెద్దాపురం సమీపంలోని కేబీకే బయోటెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. కేబీకే బయోటెక్నాలజీలోని పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ విధానం తదితర విభాగాలను పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ కె.శ్రీనివాస్ విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ, పనితీరును వివరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు సంబంధించి తమ సందేహాలను ఆయనను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి బీవీఆర్ నాయుడు, అధ్యాపకులు ఆర్.రాజా, ఎస్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

13న కాకినాడలో ఈస్ట్‌జోనల్ బాడీబిల్డింగ్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని సినిమారోడ్డు అన్నదాన సమాజంలో ఈనెల 13 వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు ఈస్ట్‌జోనల్-2 ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి మన్యం జిల్లా, విశాఖపట్నం, తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి సుమారు 200 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. బి.ఫిట్ అధినేత ఎండీ బాషా ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్ అందజేస్తారన్నారు.

నల్లమిల్లి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ



వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

కడియం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జేగురుపాడులోని రాందాస్ పేపరు మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన మిల్లు వ్యవస్థాపకుడు నల్లమిల్లి వెంకటరెడ్డి విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోరంట్ల మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం యాభై మందితో చిన్నమిషనరీతో సంస్థను స్థాపించి నేడు 10 వేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి పేపరు మిల్లును వెంకటరెడ్డి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, సర్పంచ్ యాదల స్టాలిన్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, గిరజాల బాబు, వెలుగుబంటి నాని, నాగిరెడ్డి రామకృష్ణ, మార్ని వాసుదేవరావు, పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్, పేపరుమిల్లు ఎండీ శివశంకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్‌పై కేసు నమోదు

● కలవచర్లలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు ● అనుమతి లేని మందులు సీజ్

రాజానగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవచర్ల గ్రామంలో రాజమహేంద్రవరం రూరల్ మండల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.కళ్యాణి తమ సిబ్బందితో కలిసి గురువారం దాడులు చేపట్టారు. గ్రామానికి చెందిన ఎ.విష్ణుమూర్తి అనే మెడికల్ రిప్రజెంటేటివ్ అబార్షన్ కిట్లు, వయాగ్రా టాబ్లెట్లు లైసెన్సు లేకుండా విక్రయిస్తున్నట్లుగా ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులు కూడా తన వద్ద లభించలేదన్నారు. లైసెన్సులు కలిగి ఉన్న వారు సైతం బిల్లులు లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఈ మేరకు అనుమతులు లేకుండా తన వద్ద లభించిన మందులను సీజ్ చేశామని, నిందితుడిపై కోర్టులో కేసు వేస్తామన్నారు.

వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మి



రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మార్తి లక్ష్మిని పార్టీ తూర్పు గోదావరి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించినట్టు పార్టీ కేంద్రాలయం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది.

ఘనంగా శ్రీ పుష్పయాగం

ధవళేశ్వరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా బ్యారేజ్ కాలనీ కోదండ రామాలయంలో గురువారం రాత్రి శ్రీ పుష్పయాగం ఘనంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో స్వామి అమ్మవార్లను అలంకరించారు. సీతారాములకు తొంటెపు వెంకటేశ్వరరావు దంపతులు పూజలు నిర్వహించి దంపతులకు తాంబూలాలు అందజేశారు.పలు తీపి పదార్థాలు, పండ్లు, స్వామికి సమర్పించి పవళింపు సేవ చేశారు.

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణ



రాజానగరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో ఝూన్సీ, ఉపాధ్యాయులు

రాజానగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపుచేయడంలో ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి పిలుపునిచ్చారు. యూటీ ఎఫ్ ఏపీ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తూర్పుగోదావరి జిల్లా శాఖ రూ పొందించిన స్కూల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ పోస్టర్‌ను రాజానగరం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో జేఏ ఝూన్సీతో కలిసి గురువారం ఆవిష్కరించారు. దీనిలో భాగంగా తొలి ప్రచార కరపత్రాలను ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను అమలు చేయడంలో ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర సంఘం నిర్దేశించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఆవశ్యకతను వివరించారు. జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శి దయానిధి శ్రీజయకర్, ఎ.షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా కరపత్రాలను ఉపయోగించుకుని ఆయా గ్రామాల పరిధిలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు కృషి చేయాలని పి లుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మం డల అధ్యక్ష, కార్యదర్శులు ఐడీకేడీ రాజేశ్వరిదేవి, ఏవీ శ్రీనివాసరావు, ఫణికుమార్, ఎం.శ్రీను బాబు, ఎల్.సుబ్బారావు, హరీష్ నాగేశ్వరరావు, త్రినాథ్‌కుమార్, రమేష్, మండల శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే బత్తులకు యూటీఎఫ్ వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం పాఠశాలల మెర్జింగ్ జీవో 117 ప్రత్యామ్నాయాలపై సానుకూలంగా చర్యలు తీసుకోవాలని జిల్లా యూటీఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నేతలు రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే బత్తులను కలసి వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం కృషి చేయాల్సి ఉందని, ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికలను చేపడుతున్నామని తెలియజేశారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులను కలసి వినతిపత్రాలు అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, కేవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

హానికర పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకం

- ఎమ్మెల్యే నల్లమిల్లి
- చెత్త నుంచి విద్యుత్ తయారీ కేంద్రం ఏర్పాటుపై బలభద్రపురంలో అభిప్రాయ సేకరణ



బలభద్రపురం సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి హాని చేసే పరిశ్రమల ఏర్పాటుకు తాను ఎప్పుడూ వ్యతిరేకమేనని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురం గ్రామాల మధ్య చెత్త నుంచి విద్యుత్ తయారీ కేంద్రం ఏర్పాటుపై గురువారం బలభద్రపురం పంచాయతీ ఆవరణలో సర్పంచ్ బుంగా రామారావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ పరిశ్రమ ఏర్పాటుపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించగా మెజార్టీ ప్రజలు పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ బలభద్రపురంలో ఇప్పటికే కేపీఆర్ ఫెర్టిలైజర్స్‌కు చెందిన రెండు పరిశ్రమతో బాటు గ్రాసిమ్ పరిశ్రమ నుంచి విపరీతమైన కాలుష్యం ఏర్పడుతోందని, భూగర్భ జలాలు అడుగంటాయని గ్రామంలో క్యాన్సర్ కేసులు పెరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో మరో పరిశ్రమ ఏర్పాటు చేస్తే బలభద్రపురం, దొంతమూరు, నల్లమిల్లి, సింగంపల్లి, బిక్కవోలు తదితర గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకునే వీలుందన్నారు. సమావేశంలో ఎంపీపీ తేతలి సుమ, నాయకులు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సత్తి దేవదానరెడ్డి, రావాడ నాగు, పడాల వెంకటరామారెడ్డిపాల్గొన్నారు.

అసంపూర్తి వంతెన నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారు చేయాలి

బిక్కవోలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొంకుదురులో కాకినాడ కాలువపై 2011-12లో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన వంతెన పూర్తి చేయడానికి అవసరమైన ఎస్టిమేట్లు తయారు చేయాలని అధికారులను ఎమ్మెల్యే నల్లమిల్లి ఆదేశించారు.గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి ఈ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంకుదురులో కాకినాడ కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో వంతెన పునః నిర్మాణాన్ని ప్రారంభించి మధ్యలో పనులు నిలిపివేశారు. దీనిపై ఇటీవల సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన రూ.2 కోట్లు మంజూరు చేశారన్నారు. వేసవిలో కాలువలు మూసివేస్తారు కాబట్టి ఈ వంతెన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, రావాడ నాగు,పడాల చినబుజ్జి, డీఈఈ ఆనంద్, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

రంగంపేట ఎస్‌ఐగా శివప్రసాద్



రంగంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్.ఐగా ఎస్.శివ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ పనిచేస్తూ బదిలీపై రంగంపేట వచ్చారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్.ఐ తోట కృష్ణసాయి విజయవాడ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మండలంలో ఎక్కడైన అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా 9440904854 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలపాలని కోరారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో జనసైనికుల పూజలు

ధవళేశ్వరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు సింగపూర్‌లో అగ్నిప్రమాదంలో గాయపడిన మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ ధవళేశ్వరం జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో జనసైనికులు గురువారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో షేక్ అమీనా, ఎం.నూకరాజు, ధారపు శివారెడ్డి, సీకోటి శివాజీ, దూది సాయి, దిండి జగదీష్, ఎస్.సత్తిబాబు పాల్గొన్నారు.

వివాహితపై కట్నం వేధింపులు

అనపర్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మహేంద్రవాడ ఎస్ఎంఆర్ కాలనీలో నివాసం ఉంటున్న పల్లి లక్ష్మీప్రసన్న తన భర్త ధనరాజు, అత్త ధనలక్ష్మి, మామ హనుమంతరావులు తనను అదనపు కట్నం కోసం మానసికంగాను, శారీరకంగాను వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: ఎమ్మెల్యే గోరంట్ల



తాగునీటి ట్యాంక్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశించారు. గురువారం మండలంలోని పిడింగొయ్యి పంచాయతీలో నూతనంగా నిర్మించిన హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను, కవలగొయ్యిలో నిర్మించిన వాటర్ ట్యాంకర్లను గోరంట్ల ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తోందన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందని, ప్రజలందరు తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలన్నారు. జలజీవన్ మి షన్ కార్యక్రమంలో భాగంగా వచ్చే ఏడాదినాటికి ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కమిటి ఉపాధ్యక్షుడు మార్ని వాసుదేవ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, మట్ట శ్రీను, బొప్పన నాగేశ్వరరావు, బొప్పన శ్రీను, కోరాడ వెంకటేష్, కందిరెల్లి సత్తిబాబు, మరుకుర్తి వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

హోమియో వైద్య పితామహుడు హానిమాన్‌కు నివాళి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమాన్ జయంతి కార్యక్రమాన్ని గురువారం రాజమహేంద్రవరంలోని కొప్పిరెడ్డి హోమియో ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హోమియో వైద్యులు, నగర ప్రముఖులు హానిమాన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీవీఎస్ శాస్త్రి మాట్లాడుతూ హానిమాన్ వైద్యవిధానం నేటికీ మార్గదర్శకమన్నారు. డాక్టర్ కొప్పిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్రకిషోర్, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రభుత్వ హోమియో కళాశాల ఆవరణంలోని జరిగిన కార్యక్రమానికి హోమియో వైద్యుల సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ నీలం తిలక్, సీనియర్ వైద్యురాలు డాక్టర్ కె.అనురాధ విచ్చేసి డాక్టర్ హానిమాన్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హానిమాన్ మానవాళి మనుగడలో అనేక రోగాలకు ఆరోగ్యపరమైన శాశ్వత పరిష్కారం చూపి ప్రజలందరిలో హోమియోవైద్యం విశిష్టస్థానం పొందేలా చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సత్యకుమార్, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ పీవీఎస్ చౌదరి, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ కుప్పిరెడ్డి రామకృష్ణ, డాక్టర్ తనూజ, జూనియర్ వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి సన్నద్ధం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ వడయార్‌లు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నగరంలోని 50 డివిజన్లలో పాదయాత్రలు చేస్తామని కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతామన్నారు. నగరం కమిటీ పూర్తి స్థాయిలో వేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి తీరాలన్నారు. ప్రజా సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్, పట్నాల శ్రీనివాసరావు, బెజవాడ రంగారావు, శివశంకర్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.శారద బత్తిన చంద్రరావు, నల్లా వీర్రాజు, కాటం రవి, దేవత సుధాకర్, జి.ఏసు పాల్గొన్నారు.

డాక్టర్ పద్మను కలిసిన ఏపీజీఈఏ సంఘం

కడియం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రవికుమార్, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ ఏ రవికుమార్, నర్సింగ్ ఆఫీసర్ వలీమా తదితరులు గురువారం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, డాక్టర్ ఎం.పద్మను మర్యాద పూర్వకంగా కలిసారు. జిల్లా వ్యాప్తంగా అన్ని తరగతుల సిబ్బందికి ఉన్న చిన్నపాటి సమస్యల విషయమై త్వరితగతిన జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు రవికుమార్ చెప్పారు.

గౌతమీ జీవకారుణ్య సంఘానికి విరాళం



రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన అంగటి (ప్రకాశ రావు) (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల) జ్ఞాపకార్థం వారి కుమారులు అంగటి రమేష్, సురేష్, రాజేష్. శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం నిత్య అన్నాదాన పథకానికి రూ.50 వేల విరాళంగా అందజేశారు. గతంలోనూ వీరి అమ్మగారైన అంగటి పార్వతి జ్ఞాపకార్థం కూడా అన్నదానం నిమిత్తం రూ.50 వేలు అందజేశారు.

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయింది..

కుతుకులూరులో బాలిక అదృశ్యం.. గంటలోనే ఆచూకీ కనుగొన్న పోలీసులు

అనపర్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలిక ఆచూకీని అనపర్తి పోలీసులు ఫిర్యాదు అందిన గంటలోనే కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ శ్రీను నాయక్ వివరాల ప్రకారం.. అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక గురువారం ఉదయం 7గంటల ప్రాంతంలో టిఫిన్ కోసం బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. మధ్యాహ్నం 11గంటల వరకు వెదికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే ఎస్‌ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకుని పాప కోసం ఆరా తీశారు. వివరాలు తెలుసుకున్న పోలీసులు వీరి నివాసం ఉంటున్న ఇంటి నుంచి కొద్ది దూరంలో మరమ్మతులు జరుగుతున్న సొంత ఇంటిపై అనుమానంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా ఆ ఇంట్లో పాప బిక్కుబిక్కు మంటూ కూర్చుంది. దీంతో ఆమెను వివరాలు అడుగగా తల్లి చదువుకోమని మందలించడంతో ఇంటి నుంచి చెప్పకుండా వచ్చినట్టు తెలిపింది. దీంతో పోలీసులు పాపను తల్లిదండ్రులకు అప్పగించారు.

పది గ్రామాల్లో 'గావ్ చలో అభయాన్'

రంగంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు మైలవరపు సాయిరామ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పది గ్రామాల్లో పార్టీ నాయకులు 'గావ్ చలో' (పల్లెకు పోదాం) కార్యక్రమం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును లబ్ధిదారుల ద్వారా తెలుసుకుని, ఆయుష్మాన్ మందిర్‌లను సందర్శించారన్నారు. కార్యక్రమంలో ఉండవిల్లి మాణిక్యం, గంగాధర్, ఆంజనేయులు, మండవిల్లి గుప్త, బోడెం రాంబాబు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: గావ్ చలో అభయాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధవళేశ్వరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ సచివాలయం, ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. మండలాధ్యక్షుడు షేక్ షాజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి సంతోషి, ఆకుల శ్రీధర్, యానాపు ఏసు, కె.మనోజ్‌కుమార్, ఒంటెద్దు స్వామి, డాక్టర్ జి. కొండలరావు, తలాటం సూర్యప్రకాశరావు, కురెళ్ల రామలక్ష్మి, గుజ్జల సూరిబాబు పాల్గొన్నారు.

గట్టి కుటుంబానికి పరామర్శ

కడియం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల పితృవియోగం పొందిన గట్టి సోదరులు సుబ్బారావు, నర్సయ్య లను గురువారం పలువురు పరామర్శించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జక్కంపూడి గణేష్, కాపు నాయకులు ఆకుల రామకృష్ణ, పల్ల సుబ్రహ్మణ్యం, ఈదర పాపారావు, పుల్లా రామారావు, ఆత్రేయపురం తహశీల్దారు రాజేశ్వరరావు, స్వామి వైద్యాలయ వైద్యులు డా. పరిమి నాగసత్యప్రసాద్, నర్సరీసంఘం మాజీ ఉపాధ్యక్షులు కొత్తపల్లి శివాజీ, మాజీ డైరెక్టర్ సుంకర గోవిందు, నిడదవోలు సీఐ తిలక్, జనసేన నాయకులు పాటంశెట్టి రవి, కర్రి ఎస్సయ్య, వైస్ ఎంపీపీలు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షిగోవిందు, నర్సరీరైతులు పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఈ-క్రాప్‌లో మార్పులుంటే తెలపాలి

బిక్కవోలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఈక్రాప్ వివరాల్లో మార్పులుంటే వెంటనే తెలియజేయాలని వ్యవసాయ గ్రామ సహాయ సేవకుడు అజయ్ తెలిపారు. గురువారం ఆరికరేవుల గ్రామంలో రబీ 2024-25కు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల వివరాలు వారి పంటల నమోదు గూర్చి వివరించారు. పంటల నమోదులో తేడాలు, రైతుల పేర్లు, ఆధార్ నెంబర్లలో మార్పులుంటే ఐదు రోజుల్లో తెలియజేస్తే మార్పులు చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, ఇందల వీరబాబు, రైతులు పాల్గొన్నారు.



అబ్బురపరచిన త్రివిధ దళాల విన్యాసాలు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగరతీరంలో భారత్-అమెరికా దేశాలు సంయుక్తంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్-2025 విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. గురువారం సముద్రజలాల్లో భారత్‌కు చెందిన ఐఎన్‌ఎస్ జలశ్వ, ఆకాశంలో ఐఏఎఫ్ హక్స్ యుద్ధ విమానాలు, యూఎస్‌ఏకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ సిబ్బంది విన్యాసాల్లో పాల్గొన్నారు. యాంపీబీయస్ విన్యాసాల ఔటర్ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లను కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు పర్యవేక్షించారు.





తునిలో గురువారం జరిగిన సభలో యనమలను సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. హాజరైన జనం

విజ్ఞాన గని యనమల

- సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు
- సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేత
- కొనియాడిన శాసనసభ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- తునిలో యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ

తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం తునిలో ఘనంగా జరిగింది. శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పలువురు మంత్రులు హాజరైన ఈ సభలో పుస్తకావిష్కరణతో ఫోటో గ్యాలరీలను ఏర్పాటుచేశారు.

8





- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే
- 48 గ్రామాల్లో 52,280 మందికి నోటీసులు జారీ
- 21రోజుల్లో నోటీసులకు బదులివ్వాలి
- అభ్యంతరాల స్వీకరణ తర్వాత జేసీ లాగిన్‌కు నివేదిక
- జేసీ ఆధ్వర్యంలో రీ సర్వే నివేదిక తుది ప్రచురణ
- 15 నుంచి 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వే

తొలి విడత తేలింది!

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న భూముల రీసర్వే క్రతువు కొలిక్కి వస్తోంది. తొలి విడతగా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించి రైతులకు నోటీసులు జారీచేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడత (పైలెట్ ప్రాజెక్ట్)గా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. దీనిలో కాకినాడ జిల్లాలో 15 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 17, తూర్పుగోదావరి జిల్లాలో 16 గ్రామాల్లో రీసర్వేకు ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన తొలి విడత సర్వేలో మూడు నెలలపాటు అంటే జనవరి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు అధికార బృందాలు పాల్గొన్నాయి. 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించి సర్వే చేశారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ భూముల విస్తీర్ణాన్ని బట్టి నాలుగు బృందాలుగా విభజించారు. ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్‌ఏలు ఒక బ్లాక్‌ను సర్వే చేశారు. ఇలా బృందాలు నిత్యం రీసర్వేలో పాల్గొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆదరాబాదరాగా భూముల సర్వే చేశారు. ఈ నేపథ్యంలో భూముల విస్తీర్ణం తగ్గిందని, హద్దులు మార్చేశారని, హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని పెద్దఎత్తున రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్రప్రభుత్వం భూముల రీసర్వేకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే నిర్వహించారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడతలో 16 గ్రామాల్లో భూముల రీసర్వే చేశారు. 19 వేలమంది రైతులకు నోటీసులు జారీచేశారు. క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దు కొలిచి ఏ మేరకు హక్కు పత్రాల్లో ఉన్నాయో గుర్తించారు.



కరపలో రీసర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

కాకినాడ జిల్లాలో...

కాకినాడ జిల్లాలో తొలి విడతలో 15 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో వేట్లపాలెం, కోలంక, కుమారపురం, పటవల, యల్లమిల్లి, జె.కొత్తూరు, ఎస్.తిమ్మాపురం, బోదవరం, కట్టమూరు, పి.జగన్నాథపురం, ఆర్.వెంకటపురం, శంఖవరం, కృష్ణపురం, భద్రవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో వ్యవసాయ పొలాలను రెవెన్యూ బృందాలు రీసర్వే నిర్వహించాయి. ఇటీవల 27 వేల మందికి 92 నోటీసులు జారీచేశారు. మరో 21 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొలి విడతలో 17 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో జొన్నాడ, వాడపల్లి, కొడగట్లపల్లి, ఓడరేవులపల్లి, భీమక్రోసుపాలెం, ముమ్మిడివరప్పాడు, అప్పన్నరామునిలంక, మట్టపర్రు, గాడిలంక, పశువులంక, ఉప్పలగుప్తం, ఎంట్రికోన, కందికుప్ప, నందంపూడి, వానపల్లి గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. 5,280 మంది రైతులకు 92 నోటీసులు జారీచేశారు.

తొలి విడత రీసర్వే నివేదిక

తొలి విడత భూముల రీసర్వే నోటీసులకు అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత నివేదిక తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ల లాగిన్‌కు వెళుతుంది. జాయింట్ కలెక్టర్ పరిశీలించిన తర్వాత ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. అక్కడ ఎలాంటి అభ్యంతరాలు లేని రీసర్వే నివేదికను తుది ప్రచురణ చేసి ఆమోదిస్తారు. ఈ నేపథ్యంలో రైతులు ఎంతోకాలంగా పరిష్కారం కాని భూముల హద్దులు, దొర్లిన తప్పుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించనుంది.

15 నుంచి రెండో విడత..

ఈనెల 15 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వేకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో కాకినాడ జిల్లాలో 14 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 15 గ్రామాల్లో, తూర్పుగోదావరి జిల్లాలో 17 గ్రామాల్లో రీసర్వేకు సర్వం సిద్ధమైంది. రెవెన్యూ బృందాలు, సర్వేయర్ల బృందాలను అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

దరఖాస్తులకు పరిష్కారం

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు నిండా మునిగారు. ఈ పది నెలల కాలంలో మూడు జిల్లాల్లో నిర్వహించిన గ్రామసభలకు, కలెక్టరేట్‌లకు వేలాది సంఖ్యలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అధికారులూ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ప్రభుత్వం రీసర్వేకు ఆదేశించడంతో రైతులకు ఊరట కలగనుంది.

రమ్మీ.. జీవితం డమ్మీ!



- పొలం అమ్మి ఆన్‌లైన్ రమ్మీలో కోటీ 40 లక్షలు పోగొట్టుకున్న వైనం
- ఆపై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- యథేచ్ఛగా రమ్మీ ఆన్‌లైన్ గేమ్.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేకాటే
- బానిసలైపోతున్న యువతరం.. ఇదో రకం లూటీ
- రోడ్డునపడుతున్న కుటుంబాలు.. నియంత్రణ సాధ్యమేనా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : అతడిది కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రామన్నపాలెం. ఉప్పాడ సెంటర్లో వాహనాల స్పేర్‌పార్టుల వ్యాపారం. తండ్రికి ఉన్న 90 సెంట్ల పొలాన్ని రూ.1.36 లక్షలకు విక్రయించాడు. ఈ సొమ్ముతో వేరేచోట పొలం కొనాలి. కానీ ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌లో ఈ మొత్తం సొమ్ముతోపాటు మరో నాలుగు లక్షలు సైతం దఫదఫాలుగా ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో ఈనెల 8న పురుగుమందు తాగేశాడు. వెంటనే కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అప్పుడు అసలు విషయం వెలుగుచూసింది. ఈ తరహాలోనే ఆన్‌లైన్ రమ్మీ క్యాష్ గేమ్స్‌లో ఆడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నవారు, ఇళ్లు, పొలాలు అమ్మి మరీ ఆడిన వారు, కళాశాలల్లో ఈ గేమ్‌కు బానిసలై చదువులు అటకెక్కినవారు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. నిజానికి పేకాట ఆడటం నేరం. ఎక్కడైనా పేకాట ఆడితే వారిని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. కానీ అదే పేకాట ఆన్‌లైన్‌లో ఆడితే కేసులు ఉండవు. ఇదే అదనుగా సరదాగా ఆడుకున్న రమ్మీ ఆటను పెద్ద జూదంగా మార్చేశారు. ఇంట్లో, ఆఫీసుల్లో, బస్టాండుల్లో, రెస్టారెంట్లలో, పార్కుల్లో, ఇంట్లో ఖాళీగా ఉన్న సమయంలో రాత్రి పగలూ తేడా లేకుండా ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట ఆడేస్తున్నారు. వీటిని నియంత్రించే పరిస్థితి కూడా లేదు. వాస్తవానికి పేకాట ఆన్‌లైన్‌లో ఆడటం కూడా అధికారికంగా కుదరదు. కానీ కొంతమంది ఈ పేకాటను ఎక్కడో గోవా, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, ముంబై, కలకత్తా, పంజాబ్, ఢిల్లీ వంటి ప్రాంతాల నుంచి ఆపరేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో రమ్మీని ఆడిస్తూ కోట్లాది రూపాయలు లాగేస్తున్నారు. రమ్మీలో తొలుత డబ్బులు వచ్చేలా చేసి అలవాటు చే



యడం ద్వారా ఆటగాళ్లకు వలవిసురుతారు. ఈ వలలో పడ్డ ఆటగాడు విలవిల కొట్టుకుని చివరికి అప్పులు పాలై ఊరువదిలి పెట్టి పారిపోయే పరిస్థితి. ముఖ్యంగా యువత ఈ రమ్మీ గేమ్‌ల వైపు ఆసక్తి చూపడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో తొలుత చిన్న ప్రారంభమైనా క్రమేపీ లక్షల్లోకి ఈ గేమ్ వెళ్లిపోతుంది. దీనికి మళ్లీ కొంతమందితో ప్రమోట్ చేయించడంతో చాలామంది యువత ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. యువతతోపాటు పెద్దవాళ్లు కూడా ఈ ఆటలకు బానిసలు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతుంది. కొంతమంది సామూహాన్ని ఒకచోట కేంద్రీకృతం చేసి వారు కార్డులను వారికి ఓపెన్‌గా చూసుకుని గేమ్ ఆడి దానిని ఆ గ్యాంగ్‌లోని వారే షో కొట్టేవిధంగా వ్యూహాత్మకంగా ఇది నడుస్తుంది. దీనివల్ల వివిధ ప్రాంతాల నుంచి ఆడేవారంతా నష్టపోతారు. నగదు అంతా ఈ గేమ్ నిర్వహించే ముఠాకే వెళ్లిపోతుంది. దీన్ని ఆధారాలతో పట్టుకునే వారే ఉండరు. ఆన్‌లైన్ పేకాటలు, బెట్టింగ్ యాప్‌లపై ఎటువంటి ఫిర్యాదు ఉండడంలేదు. దీనికి కారణం ఆన్‌లైన్ జూదంలో సొమ్ములు పోగొట్టుకున్నామని చెప్పుకోలేరు. ఒకవేళ చెబితే తొలుత చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు కాబట్టి దాంతో విషయం వెలుగుచూసే అవకాశం ఉండదు. ఈ తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మరెన్నో కుటుంబాలు రోడ్డునపడతాయి.

73373 59375

ఈ నెంబర్‌కు వాట్సాప్ చేస్తే ధాన్యం కొనుగోలు షెడ్యూలింగ్

సాంకేతికత సహాయంతో ప్రజల ఇబ్బందులను సాధ్యమైనంత దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే రైతులకు బకాయి లేకుండా ధాన్యం సొమ్ములను ఖాతాలో వేయడంలో మెరుగైన వ్యవస్థను ఏర్పాటుచేసింది. దీనిలో భాగంగానే ధాన్యం విక్రయాల సమయంలో రైతన్న ప్రయాసను తగ్గించే ఏర్పాటుచేసింది. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి గంటల తరబడి బస్తాలతో వేచివుండే ఇబ్బందికి చెక్ పెట్టడానికి వాట్సాప్ షెడ్యూలింగ్ నెంబరును అందుబాటులోకి తెచ్చింది. ఈనెల 5న ధాన్యం కొనుగోలు ప్రారంభించిన నాటి నుంచే ఆ నెంబరు పనిచేస్తోంది. ఈ-క్రాప్‌లో నమోదై ఉన్న నెంబరు కలిగిన ఫోనులో రైతు ముందుగా 7337359375 నెంబరును సేవ్ చేసుకోవాలి. రైతు నెంబరు నుంచి ఆ వాట్సాప్ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పెట్టాలి. వెంటనే 'పౌర సరఫరాల సంస్థకు స్వాగతం, ధాన్యం అమ్మడానికి షెడ్యూల్ చేసుకోండి' అనే జవాబు వస్తుంది. దానిలోని షెడ్యూల్‌పై క్లిక్ చేసి రైతు తన ఆధార్ నెంబరును నమోదు చేయాలి. రైతు పేరు, ధాన్యం విక్రయించాల్సిన కొనుగోలు కేంద్రం పేరు కనిపిస్తాయి. కొనుగోలు కేంద్రంపై క్లిక్ చేయగానే.. ధాన్యం అమ్మే తేదీని ఎంచుకోవాలనే మెసేజ్ వస్తుంది. నచ్చిన తేదీని ఎంపిక చేయగానే టైమ్ స్లాట్లు కనిపిస్తాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ మూడు స్లాట్లు, ధాన్యం రకాలు అందుబాటులో ఉంటాయి. వాటిని ఎంచుకొని ఆ సమయానికి అమ్మకానికి ధాన్యం తీసుకెళితే సరిపోతుంది. కాగా.. జిల్లాలో 216 కొనుగోలు కేంద్రాలను ఈ నెల 5న ప్రారంభించిన విషయం తెలిసిందే. 2.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా.. ఇప్పటివరకూ 10 వేల టన్నులు కొనుగోలు చేశారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)




బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పెట్టుబడితో రండి.. భరోసా మాది : దుర్గేష్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో పెట్టుబడులతో వస్తే మిగతా భరోసా తమదని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. ముంబైలో జరిగిన దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ రెండో రోజున నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ ప్రతినిధులతో మాట్లాడారు. రెండు రోజుల పర్యటనలో 45 ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఆసక్తి కనబరచారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

పన్నుల వసూళ్లలో ఆర్ఎంసీకి రెండో స్థానం



ఉత్తమ అవార్డును అందుకుంటున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ రెండో స్థానంలో నిలిచింది. గురువారం విజయవాడలో జరిగిన వర్క్‌షాపులో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఉత్తమ అవార్డు, నగదు బహుమతులను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, సీడీఎంఏ సంపత్‌కుమార్ చేతుల మీదుగా అందించారు.



గ్యాస్ ధర ఒకేసారి రూ.50కి పెంచడంపై ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గ్యాస్ సిలిండర్‌పై ఇంత భారం మోపడం దారుణమని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా వామపక్ష పార్టీలు, వాటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ ధరల పెంపు విషయంలో పునరాలోచన చేయాలని, సామాన్యులపై భారాన్ని మోపకుండా చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

గ్యాస్ ధరల మంటలు!

- సిలిండర్ ధర రూ.50 పెంపు
- వినియోగదారులపై అదనపు భారం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ సిలిండర్ ధర చమురు కంపెనీలు ఒక్కసారిగా రూ.50 పెంచేయడంపై ఇప్పటికీ ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అమాంతం పెరిగిన ఈ ధరతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 17 లక్షల 97వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధరను పెంచడంతో వినియోగదారులు రూ.8 కోట్ల 98లక్షల వరకు అదనంగా చెల్లించాల్సి ఉంది. దీనిలో కాకినాడ జిల్లాలో 6 లక్షల 92 వేల కనెక్షన్లు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 లక్షల 30వేల గ్యాస్ కనెక్షన్లు, తూర్పుగోదావరి జిల్లాలో 5 లక్షల 70వేల వరకు కనెక్షన్లు ఉన్నాయి. కాకినాడలో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.831 ఉండగా తాజాగా పెరిగిన ధరలతో రూ.881 పెట్టి వినియోగదారులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. పెరిగిన ధరలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఉజ్వల పథకంలో ఒక సిలిండర్ ధర రూ.503 ఉండగా అది కాస్తా రూ.553కు ధర పెరిగింది. పెరిగిన ధరలపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్యాస్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, వాటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం కలెక్టరేట్ల వద్ద నిరసన ప్రదర్శనలు చేయడంతోపాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా మండలాలు, డివిజన్ల స్థాయిలో కూడా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జూహితకు గోల్డ్‌మెడల్ 8

4వ వార్డులో కవర్ శ్లాబ్‌ల నిర్మాణ పనులు


4వ వార్డులో పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ అభివృద్ధికి అధికారులు, ప్రజలు సహకారం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి కోరారు. 4వ వార్డులోని ప్రధాన డ్రైనేజీపై 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 10 లక్షలతో కవర్ శ్లాబ్‌ల నిర్మాణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 4వ వార్డులో డ్రైనేజీపై గతంలో కొంతభాగం కవర్‌శ్లాబ్‌ల నిర్మాణం చేపట్టామని, మిగిలిన పనులను ప్రస్తుతం ప్రారంభించడం జరిగిందన్నారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ విజయలక్ష్మి ఇంజనీరింగ్ వర్క్సు పెరుమాళ్ళ ఉమామహేశ్వరరావుకు పనులు అప్పగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సందీప్, మాజీ కౌన్సిలర్ భావన బెన్ని, నాగరాజు, సురేష్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

16 లోగా అబ్జెక్షన్, గ్రీవెన్స్ దరఖాస్తులు సమర్పించాలి

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (పూర్వపు వైద్య విధాన పరిషత్) ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయడానికి 01/ 2025 నోటిఫికేషన్ ద్వారా మార్చి 13 నుంచి 21 వరకు దరఖాస్తులు స్వీకరించామని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.పద్మ తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులు పరిశీలన అనంతరం వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ లిస్టులో పొందుపర్చారు. ఆ జాబితాలలో ఉన్న అబ్జెక్షన్, గ్రీవెన్స్‌లను ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లోని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు. 16వ తేదీ ఐదు గంటలు దాటిన తరువాత వచ్చిన అబ్జెక్షన్స్, గ్రీవెన్స్‌లు స్వీకరించబడవన్నారు. అబ్జెక్షన్, గ్రీవెన్స్ పరిశీలన అనంతరం అభ్యర్థుల ఫైనల్ మెరిట్‌లిస్టు, ఇన్ ఎలిజిబుల్ అభ్యర్థుల జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల అబ్జెక్షన్, గ్రీవెన్స్‌ను వెబ్‌సైట్ నందు పొందుపర్చిన గ్రీవెన్స్ అప్లికేషన్‌లో మాత్రమే పూర్తిచేయాలన్నారు. గ్రీవెన్స్ అప్లికేషన్ లేని అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకొనబడవన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన


డిపో ఎదుట నిరసనలో ఎన్ఎంయూ నాయకులు, ఇతరులు

నిడదవోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వివిధ కేటగిరీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరసలో భాగంగా నిడదవోలులో కూడా ధర్నా నిర్వహిస్తున్నట్టు నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో మెయిన్ గేటు వద్ద భోజన విరామ సమయంలో సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవచూపాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌వీ రావు, గ్యారేజీ కార్యదర్శి ధనరాజ్, ఎంఆర్ కుమార్, గాంధీ, హనుమంతరావు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

గోపాలపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మహిళలకు తీవ్రగాయాలైన సంఘటన వెదుళ్లకుంట, వాదాలకుంట గ్రామాల మధ్య గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ... యాదవోలు నుంచి ద్విచక్ర వాహనంపై తల్లీ కుమార్తెలు వస్తుండగా.... వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం వీరు నడుపుతున్న వాహనాన్ని ఢీకొనడంతో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లపూడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లపూడి, కుకునూరు, వేగేశ్వరపురం గ్రామాలకు సరఫరా ఉండదు.

రుణాలకు బ్యాంకర్లు సహకరించాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, బ్యాంకు అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : యువతకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించేందుకు బ్యాంకర్లు సహకరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో బీసీ కార్పొరేషన్ రుణాలు గ్రౌండింగ్‌కు సంబంధించి నియోజకవర్గంలోని బ్యాంకర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధ్యమైనంత ఎక్కువ మందికి రుణాలు అందించాలని బ్యాంకర్లను సూచించారు. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ 20 లక్షల మందికి యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు విశేష కృషి చేస్తున్నారన్నారు. త్వరలో రాజమహేంద్రవరంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసి యువతకు స్వయం ఉపాధిపై శిక్షణ అందజేస్తామన్నారు. అలాగే మున్సిపాల్టీలో రోడ్డు మార్జిన్లలో రోజువారీ వ్యాపారాలు చేసుకుంటున్నవారికి గ్రూపు రుణాలు అందించాలని బ్యాంకర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు అందజేస్తున్న సబ్సిడీ రుణాలను ఎక్కువ మందికి ఇచ్చి సహకరించాలన్నారు. బ్యాంకర్లు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు రుణం సక్రమంగా తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, తాళ్లపూడి, చాగల్లు మండలాల ఎంపీడీవోలు రమణ, శ్రీదేవి, మున్సిపల్ ఏఈ సందీప్ పాల్గొన్నారు.

'జయంత్యుత్సవాలను' ఘనంగా జరుపుదాం


సమిశ్రగూడెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిడదవోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలను ఘనంగా జరుపుకుందామని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు అన్నారు. గురువారం సమిశ్రగూడెంలోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం అగ్రకుల ఆధిపత్య శక్తులు దళితులపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు.కార్యక్రమంలో ముప్పిడి శ్రీను, దిద్దే రాజు, చందు, యల్లమెల్లి రవితేజ, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడిగా బాబ్జీ


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడిగా బాలదారి బాబ్జీ ఎన్నికయ్యారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాద గుమస్తాల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ప్రెసిడెంట్‌గా బాలదారి బాబ్జీ, సెక్రటరీగా జేపీ రాజు, ఉపాధ్యక్షుడిగా డీఎల్ఎన్ సాయి, జాయింట్ సెక్రటరీగా పి. సత్తిబాబు, కోశాధికారిగా కె. రాము, గౌరవాధ్యక్షులుగా బి.పోలయ్య, సీహెచ్ రామారావు, కె.శ్రీనివాసరావు,టి.కెనడీ ఎన్నికయ్యారు.

నీటి ఎద్దడి నివారణకు రూ.22.50 లక్షల కేటాయింపు

దేవరపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు మండల పరిషత్ బడ్జెట్ నిధుల నుంచి రూ. 22.50 లక్షలు కేటాయించినట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు.

ఇంద్రకుమార్ సహకారం అభినందనీయం

● ఇంటర్నల్ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


కుమారదేవం గురుకుల పాఠశాలలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి , అవంతి సంస్థల చైర్మన్ ఇంద్రకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి అవంతి సంస్థల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కుమారదేవం గురుకుల పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 25 లక్షలతో నిర్మించిన ఇంటర్నల్ రోడ్లను ప్రారంభించారు. అలాగే అవంతి ఫౌండేషన్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ విద్యార్థినుల సౌకర్యార్థం రూ. 20 లక్షలతో పాఠశాలలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్‌ప్లాంట్, జిమ్ సామగ్రిని ఎమ్మెల్యే , అవంతి చైర్మన్, అవంతి ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ అల్లూరి తులసీ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, పెరుగు పోతురాజు, సుంకర సత్తిబాబు, గౌరిజాల సురేష్, సర్పంచ్ మేకల శ్రీను, సుంకర సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన రామ నామస్మరణ


విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నల్లజర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురుగూడెం గురువారం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామంలోని రామాలయం వద్ద గత ఐదురోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారంరాత్రి భీమవరం ఇస్కాన్ టెంపుల్ ప్రభూజీ వంశీకృష్ణదాస్ ధర్మసందేశం అందించగా, చివరిరోజు గురువారం స్వామివారిని తీన్‌మార్ డప్పులు, మేళాతాళాలతో బాణసంచా కాల్చుతూ గ్రామపుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో చెల్లు పెద్ద రామన్న, కూసంపూడి వెంకటేశ్వరావు (బుజ్జి) , చెల్లు వీరవెంకట్రావు, చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు దానరావు, కంపర దుర్గరావు, విడియాల చిరంజీవి, మద్దిపాటి సూరిబాబు, చెల్లు కృష్ణమూర్తి, తలంశెట్టి రామకోటి, చిన్నవెంకట్రావు, మోహన్, పల్లపరాజు పాల్గొన్నారు.

యనమల విజ్ఞాన గని


సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

● సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు
● అధిరోహించిన పదవులు అన్నింటికీ వన్నె తెచ్చిన నేత
● సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేతగా పేరొందారు
● యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభలో కొనియాడిన స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు
● సభకు తరలివచ్చిన నేతలందరికీ కృతజ్ఞతలు : యనమల

కాకినాడ/ తుని రూరల్ ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ సీనియర్ నేత యనమల రాజకీయ విజ్ఞాన గని. అమరావతి నుంచి అమెరికా వరకు అనేక అంశాలను నిత్య విద్యార్థిలా చదువుతూ అందరికీ వివరిస్తూ ఎంతో ఖ్యాతి గడించారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు, మంత్రులకు యనమల రాజకీయ గురువు. 42ఏళ్ల రాజకీయాల్లో ఆయన చూడని పదవులు, హోదాలు లేవు. ఇన్నేళ్ల రాజకీయాల్లో ఏరోజు గర్వపడడం కానీ, కుంగిపోవడం కానీ ఎరుగని నాయకుడు. సంక్షోభాలు, సమస్యలు ఎదురైనా చెక్కుచెదరకుండా శ్రీకృష్ణుడిలా చిరునవ్వుతూ కనిపించే యనమల రాజకీయ రారాజు' అని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రులు అనిత, అచ్చెన్న, నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు కొనియాడారు. కాకినాడ జిల్లా తునిలో యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలిరావడంతో తుని పట్టణంలో సాయివేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భారీ బాణసంచా మిరిమిట్ల మధ్య సభ పండుగ వాతావరణంలో కళకళలాడింది.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇతర నేతలతో కలిసి యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకుముందు అక్కడే ఏర్పాటు చేసిన యనమల ఫొటోగ్యాలరీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. గ్యాలరీలో యనమల చిన్ననాటి నుంచి నేటివరకు ఏర్పాటు చేసిన ఫొటోలు ఆకట్టుకున్నాయి. హోంమంత్రి అనిత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగిన యనమల తూర్పుగోదావరి జిల్లాకు ఎంతో ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. రాజకీయాల్లో విలువైన వ్యూహకర్తగా పేరొందారని కొనియాడారు. అర్హత ఉన్న వారికి జరుగుతున్న సన్మానం అని పేర్కొన్నారు. యనమల సంస్కారం, సమర్థతతో ఎందరికో రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎన్టీఆర్‌కు యనమల ముద్దుబిడ్డగా మారారని, ఎందుకు యనమలను అంతగా ఇష్టపడ్డారో తెలియలేదన్నారు. 11 సార్లు ఆర్థిక మంత్రిగా పని చేయడం అరుదైన రికార్డు అని వివరించారు. మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, నారాయణ ప్రసంగిస్తూ యనమల నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఎంతోమంది ఎమ్మెల్యేలకు అనేక విషయాలు నేర్పినవారు రాజకీయంగా మరింత ఎదిగేలా సహకరించారని గుర్తుచేశారు. అనేక రాజకీయ సంక్షోభాలప్పుడు ఆయన్ను కలవడానికి వెళ్లినప్పుడు చిరునవ్వుతో ఒత్తిడి లేకుండా కనిపించడం ఆయనకు మాత్రమే సాధ్యమని వివరించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఉన్న ప్పుడు తామంతా యనమలనుంచి ఎంతో నేర్చుకున్నామన్నారు.అవకాశాలు అందరికీ వస్తాయని, వాటిని అందిపుచ్చుకుని నిలబడడం యనమలకు మాత్రమే సాధ్యమన్నారు. యనమల, కింజరపు, గౌతు, ప్రతిభా భారతి తదితర కుటుంబాలు ఎప్పుడూ నారా కుటుంబానికి అంకితమన్నారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ యనమలకు కొడుకులు లేరని రాజకీయ వారసత్వం కనుమరుగు అయిపోతుందన్న ఆవేదన తనకు ఉండేదని, కానీ దివ్య రాకతో ఆ కొరత తీరిందని అన్నారు. రాజకీయాల్లో పదవులు లేకపోయినా క్రమశిక్షణగా ఉండాలని, పదవులు లేవని, అన్యాయం జరిగిందని అంటే ఎదగలేమని అన్నారు. యనమల ఎప్పుడూ టీడీపీకి గైడ్‌గా ఉండాలని కోరారు. యనమల సలహాలు పార్టీకి, నేతలకు ఎంతో అవసరమని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ యనమల రాజకీయాల్లో వటుడంతడిలా ఎదిగారన్నారు. ఆయనలో తాను ఎప్పుడు కోపం, ఆవేశం చూడలేదన్నారు. అందుకే తనకు యనమలను చూస్తే ఈర్ష్యగా ఉందని చమత్కరించారు. యనమల దేశస్థాయిలో మంచి పదవులోకి వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం తుని ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ తన తండ్రి గురించి మంత్రులు అందరూ గొప్పగా మాట్లాడడం చాలా సంతోషంగా ఉందని, ఆయన నుంచి ఇంతమంది నేతలు ఎన్నో నేర్చుకోవడం తనకు గర్వకారణంగా అనిపిస్తుందన్నారు. ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలను పక్కన కూర్చోబెట్టుకుని యనమల సలహాలు, సూచనలు ఇచ్చారని తాను ఎప్పుడైనా ఏదైనా అడిగితే పోయి పుస్తకం చదువుకో అనేవారని అని సరదాగా వ్యాఖ్యానించారు. అనంతరం ఎమ్మెల్యేలు బుచ్చిబాబు, ఆనందరావు, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు.


సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

యనమల టీడీపీకి అత్యంత విలువైన నేతగా కొనియాడారు. తామంతా కష్టసుఖాలు ఎప్పుడు యనమలతో పంచుకుంటూ ఆయన అనుభవాలనుంచి ఎన్నో నేర్చుకున్నామని గుర్తు చేశారు. సభా కార్యక్రమంలో ఆఖరిలో ప్రసంగించిన యనమల తన 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని నెమరువేసుకున్నారు. చిన్న వయస్సులో ఎన్టీఆర్ టిక్కెట్ ఇచ్చి ప్రోత్సహించారని గుర్తు చేశారు. అనంతరం చంద్రబాబుతో కలిసి సుదీర్ఘంగా పని చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 38ఏళ్లు కేబినేట్ హోదాలో కొనసాగడం పార్టీ తనకు ఇచ్చిన గౌరవంగా భావిస్తానన్నారు. సభకు ఇంతమంది రావడం ఆనందం కలిగిస్తోందన్నారు. సభా కార్యక్రమంలో తొలుత యనమల ప్రస్థానంపై ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన అందరినీ అలరించింది. సభావేదికకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరై యనమలకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సభా కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కదులుదాం రండి మనం.. జన్మభూమికి.. గీతాన్ని ఆలపించి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు తరలిరాగా యనమల వారికి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.

ఓటర్ల సమస్యలు పరిష్కరించాలి


ఉండ్రాజవరంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సతీష్

ఉండ్రాజవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల సమస్యలను బీఎల్‌వోలు తక్షణమే పరిష్కరించాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఈఆర్వో) కె. సతీష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటుకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ప్రతి అనుమానాన్ని బీఎల్‌వోలు నివృత్తి చేయాలని సూచించారు. అనంతరం ఓటర్ల నమోదులో నూతన విధానాలపై ఏఎస్‌వో టీ. వెంకటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. కొత్త ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులు, తదితర విషయాలపై మండలంలోని 58 మంది బీఎల్‌వోలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, నిడదవోలు ఎలక్షన్ డీటీ ఎన్. ప్రసాదరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అపరాల విత్తనాల పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి రాజారావు

గోపాలపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి అపరాల సాగుకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో రాజారావు అన్నారు. మండలంలోని ఆయాగ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలను గురువారం రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలానిక 7.8 క్వింటాళ్ల మినుములు, 40 క్వింటాళ్ల పెసలు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని 50 శాతం రాయితీపై రైతులకు అందజేస్తామన్నారు.

ఛానల్ విలేఖరిపై .. దాడి ఘటనలో వ్యక్తి అరెస్ట్

నల్లజర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో ఒకరిని నల్లజర్ల పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివి... అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద మార్చి 18న జరిగిన గొడవలో ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన ఊరకారణం జగన్నాథరావు టోల్‌ప్లాజా వద్ద ఎటువంటి రుసుము చెల్లించకుండా తాను సీఎంవో ఆఫీసులో పనిచేస్తున్నానని అక్కడి సిబ్బందితో వాగ్వాదం చేస్తుండగా న్యూస్ కవరేజ్ కోసం అటుగా వెళుతున్న ఓ ఛానల్ విలేఖరి బురుగు భాగ్యరాజు ఫొటో తీశాడు. దీంతో ఆగ్రహించిన ఆయన కెమెరాను ధ్వంసం చేశాడు. అంతేకాకుండా దాడికి పాల్పడడంతో అప్పట్లో భాగ్యరాజు ఫిర్యాదుచేశాడు. ఈమేరకు సదరు వ్యక్తిని అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు గురువారం తరలించారు. జగన్నాథరావు ప్రతిచోటా సీఎంవో అధికారినని చెప్పుకుని తిరుగుతున్నట్టు పోలీసుల విచారణలో తేలింది.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఆర్థిక సమస్యల కారణంగా ఓ యువకుడు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపిన వివరాల ప్రకారం ... ఆరికిరేవుల గ్రామానికి చెం దిన మారిశెట్టి శివనారాయణ (24) గత కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఇంతలో అనారోగ్యం చేకూరడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనుల కోసం వెళ్లిన తండ్రి సత్యనారాయణ ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో మృతదేహాన్ని కిందకు దింపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి సత్యనారాయణ అందించిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జి. శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

బీరువా తాళం పగులగొట్టి... బంగారం, నగదు చోరీ

నిడదవోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని శింగవరం రోడ్డులో బలిజి సత్యనారాయణ తన కుమార్తెతో కలిసి ఉం టున్నాడు. బుధవారం తన కుమార్తె స్కూల్‌కు వెళ్లిపోగా, సత్యనారాయణ ఇంటికి తాళం వేసి పని మీద బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి దొంగలు బీరువాను వెల్డింగ్ కట్టర్‌తో పగులగొట్టి అందులోని సుమారు 35 కాసుల బంగారం, 12 వేల నగదు, వెండి వస్తువులు దొంగిలించుకుపోయారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జూహితకు గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్‌తో క్రీడాకారిణి జూహిత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్రీడా కీర్తి దేశవ్యాప్తంగా ఇనుమడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరానికి చెందిన విద్యార్థి జూహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటి గోల్డ్‌మెడల్ సాధించింది. మణిపూర్‌లోని ఇంఫాల్ నగరంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు అండర్-17 విభాగంలో రాజమహేంద్రవరంలోని లాలాచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థిని జూహిత గుణ గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే జూహిత గుణ ప్రతిభను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రత్యేకంగా అభినందించారు.